# దేవుని నమ్ముచున్నాము

మొదటి పాఠము

## దేవుని గూర్చి మనకు ఏమి తెలుసు

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2012 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన, థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుంచి వ్రాతమూలకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహాయిస్తే, పునఃర్ముద్రింపబడకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపింపబడిన థర్డ్ మిలీనియం పరిచర్యలు ఒక లాభాపేక్షలేని క్రైస్తవ వ్యవస్థగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను సమకూర్చు నిమిత్తము ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

వర్తమాన కాలములో హితమైన, లేఖనానుసారమైన క్రైస్తవ నాయకత్వ శిక్షణ కొరకు ఇతోధికంగా అధికమవుతున్న విశ్వవ్యాప్త అవసరతకు ప్రతిస్పందనగా, మేము తేలికగా ఉపయోగించడానికి వీలైన, దాతల పోషణతో, బహుముఖ ప్రసార మాధ్యమముల ద్వారా ప్రయోగింపబడగల వేదపాఠ అధ్యయన శాల పాఠ్య క్రమమును ఐదు ప్రధాన భాషలలో (ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, మాండరిన్ చైనీస్, మరియు అరబిక్) సిద్ధం చేస్తున్నాము మరియు ఇది అత్యావశ్యకమైయున్నవారికి, ప్రాథమికంగా సంప్రదాయిక విద్యనభ్యసించడానికి అందుబాటులేని, లేదా ఆర్థికంగా భరించలేని క్రైస్తవ నాయకులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. పాఠములన్నియు రచింపబడినవి, రూపొందింపబడినవి, మరియు సంస్థలోపలే సిద్ధంచేయబడుతున్నవి, మరియు శైలి మరియు నాణ్యతలో హిస్టరీ ఛానల్©లో ప్రసారమగువాటి వలెనున్నవి. క్రైస్తవ నాయకులకు శిక్షణ నిచ్చుటకు ఈ అసమానమైన, ఖర్చుకు తగిన ఫలితమునిచ్చు పద్ధతి చాలా కార్యసార్థకమైనదై యున్నదని ప్రపంచమందంతటను రుజువయ్యింది. విద్య మరియు సజీవ వ్యంగ్య చిత్రముల ఉపయోగములో ప్రయోజనపడు విశిష్టమైన వీడియో చిత్రముల ఉత్పత్తి విషయంలో మేము టెల్లి అవార్డ్స్ గెలుచుకున్నాము, మరియు మా పాఠ్య క్రమము ప్రస్తుతము 192 కంటే ఎక్కువ దేశాలలో ప్రయోగింపబడుతుంది. థర్డ్ మిలీనియం పరిచర్యల యొక్క సాహిత్యం మొదలగు వస్తువులైన డీవీడీ, ముద్రణ, ఇంటర్నెట్, ఉపగ్రహ దూరదర్శిని ప్రసారములు, మరియు రేడియో మరియు దూరదర్శిని ప్రసారముల రూపంలో వాడబడుతున్నవి.

ఈ పరిచర్యలను గూర్చి మరియు మీరు మాతో కలసి ఎలా పరిచర్య చేయవచ్చునో తెలిసికొనగోరుచున్నట్లయితే, అదనపు సమాచారం కొరకు http://thirdmill.org ను సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతము ... 1
ప్రత్యక్షత & మర్మములు ... 2
దైవిక ప్రత్యక్షత ... 2
మూల భావన ... 2
రకములు ... 5
దైవిక మర్మములు ... 12
మూల భావన ... 12
రకములు ... 16
గుణములు & కార్యములు ... 20
దైవిక గుణములు ... 20
మూల భావన ... 20
రకములు ... 25
దైవిక కార్యములు ... 28
మూల భావన ... 28
రకములు ... 31
ముగింపు ... 34



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# దేవుని నమ్ముచున్నాము

మొదటి పాఠము

దేవుని గూర్చి మనకు ఏమి తెలుసు

## ఉపోద్ఘాతము

"దేవుని ఎరుగుట"ను పలువురు పలు విధాలుగా అర్థం చేసుకుంటారు — దేవునితో వ్యక్తిగత అన్యోన్యతను అనుభవించుట మొదలుకొని, ఆయన అద్భుత కార్యములను చవిచూచుట, మరియు ఆయనను గూర్చి పరిశుద్ధాత్మ బయలుపరచిన సత్యములను గ్రహించుట వరకు. దేవునితో వ్యక్తిగత అనుబంధము కలిగియుండుట మరియు లోకములో ఆయన కార్యములను వీక్షించుట విలువైన పని అని మనలో చాలామందిమి గుర్తిస్తాము. కాని దురదృష్టవశాత్తు, మనకు వీలైనంత వరకు దేవుని గూర్చిన సత్యములను గూర్చి నేర్చుకొనుట కూడా అంతే ప్రాముఖ్యమైన విషయమని మనలో చాలా మందిమి గుర్తించము. మరియు ఇది వింతైన విషయమేమి కాదు. సాంప్రదాయిక క్రమబద్ధ వేదాంతవేత్తలు "దేవుని సిద్ధాంతము," లేక "దేవుని గూర్చిన వేదంతశాస్త్రము" అని పిలచుదానిని అధ్యయనం చేయుట ఎంత క్లిష్టమైన పని అంటే దాని కొరకు మనము ఎంతో కృషి చెయ్యాలి. కాని అది ఎంత కష్టమైనా, దేవుని గూర్చి మనము ఎంత ఎక్కువగా నేర్చుకుంటే, అంత ఎక్కువగా ఆయనతో మన వ్యక్తిగత సంబంధము బలపడుతుంది. మరియు ఆయనను గూర్చి మనము ఎన్ని సత్యములు తెలుసుకుంటే, అంత ఎక్కువగా లోకములో ఆయన కార్యములను గూర్చిన, మన అవగాహన ఎదుగుతుంది. వాస్తవానికి, దేవునిని గూర్చి మనము నేర్చుకొనగలిగినంత నేర్చుకుంటే అది మన క్రైస్తవ విశ్వాసము యొక్క ప్రతి కోణమును బలపరుస్తుంది.

దేవుని గూర్చిన వేదాంతశాస్త్రము, లేక స్వయానా దేవుని గూర్చిన అధ్యయనమునకు అంకితం చేయబడిన మన పాఠ్యక్రమమైన, *దేవుని నమ్ముచున్నాము*లో, ఇది మొదటి పాఠము. ఈ పాఠమునకు మేము, "దేవుని గూర్చి మనకు ఏమి తెలుసు" అనే శీర్షికనిచ్చాము. ఈ పాఠంలో, దేవుడు ఎవరు మరియు ఆయన ఏమి చేస్తాడు అను విషయములను అర్థము చేసుకొనుటకు సంబంధించి కొన్ని అత్యంత సామాన్యమైన ప్రశ్నలను ఇవాంజెలికల్ క్రమబద్ధ వేదాంతవేత్తలు ఎలా పరిగణిస్తారో మేము పరిచయం చేస్తాము.

దేవుని గూర్చి మనకు ఏమి తెలుసు అనే అంశమును గూర్చిన ఈ పరిచయ పాఠము రెండు జతల సామాన్య అంశముల మీద దృష్టి పెడుతుంది. మొదటిగా, మనము దేవుని యొక్క ప్రత్యక్షత మరియు మర్మములను విశదీకరిద్దాము — దేవుడు తనను గూర్చి తాను ఏమి బయలుపరచాడు మరియు తనను గూర్చి తాను ఏమి మరుగుపరచాడు. మరియు రెండవదిగా, మనము దేవుని గుణములను మరియు కార్యములను పరీక్షించుదాము — దేవుని సిద్ధాంతము యొక్క సాంప్రదాయిక విశ్లేషణలలో రెండు కీలకమైన అంశములు. మొదటిగా దేవుని ప్రత్యక్షత మరియు మర్మములను చూద్దాము రండి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ప్రత్యక్షత & మర్మములు

ఈ అంశమును సులభతరం చేయుట కొరకు, దేవుని యొక్క ప్రత్యక్షత మరియు మర్మములను వేర్వేరుగా పరిగణిద్దాము. మనము మొదటిగా దైవిక ప్రత్యక్షతతో ఆరంభించి, తరువాత దైవిక మర్మములను చూద్దాము. దేవుని ప్రత్యక్షతను గూర్చి, లేక మానవాళికి ఆయన బయలుపరచిన విషయములను గూర్చి క్రైస్తవులు ఏమి నమ్ముతారో చూచుటతో ఆరంభిద్దాము.

## దైవిక ప్రత్యక్షత

దేవుని సిద్ధాంతమును చదువుచుండగా దైవిక ప్రత్యక్షత కంటే మరింత ప్రాముఖ్యమైన అంశమును గూర్చి ఊహించుకొనుట సాధ్యము కాదు. దేవుడు తనను గూర్చి తాను ఏమి బయలుపరచుకున్నాడు? ఆయన దానిని ఏ విధంగా చేశాడు? ఈ ప్రశ్నలకు మనము ఇచ్చు జవాబులు దేవుని గూర్చిన వేదాంతశాస్త్రములోని ప్రతి అంశమునకు ఆరంభ బిందువుగా ఉంటాయి.

దైవిక ప్రత్యక్షత అనే ఆలోచనను మనము రెండు మార్గములలో పరిచయం చేద్దాము. మొదటిగా, ప్రత్యక్షత అను మూల క్రైస్తవ భావనను మేము పరిచయం చేస్తాము. మరియు రెండవదిగా, దేవుని గూర్చి నేర్చుకొనుచుండగా మనము మనస్సులో ఉంచుకొనవలసిన రెండు ముఖ్య రకములైన ప్రత్యక్షతలను చూద్దాము. అయితే, దైవిక ప్రత్యక్షతను గూర్చి మూల భావన ఏమిటి?

### మూల భావన

మన ఉద్దేశముల కొరకు, దైవిక ప్రత్యక్షత అనే మూల క్రైస్తవ ఆలోచనను మనము ఈ విధంగా క్రోడీకరించవచ్చు:

> దేవుని స్వయం-ప్రత్యక్షత, ఎల్లప్పుడూ మానవ ఆలోచనలకు అనుగుణంగా మరియు క్రీస్తు ద్వారా సంపూర్ణంగా ఇవ్వబడినది.

ఈ భావన యొక్క రెండు కోణములను ఎత్తిచూపవలసియున్నది, మరియు మొదటిగా దేవుడు తనను తాను ఎల్లప్పుడూ మానవ ఆలోచనలకు అనుగుణంగా బయలుపరచుకున్నాడు అనే సత్యముతో ఆరంభించాలి.

> వాస్తవానికి నా నమ్మకం ప్రకారం, బైబిలులోని దేవునిని గూర్చి అత్యంత అద్భుతమైన విషయములలో ఒకటి ఏమిటంటే, ఆయనకు మాత్రమే ప్రత్యేకమైనది ఏమిటంటే, కాల పరిమితులు కలిగి మితమైన చరిత్రలో ఉనికిలో ఉన్న మానవమాత్రులతో అనుబంధ పరచుకొను సమయములో కూడా ఆయన తాను కలిగియున్న సార్వభౌమత్వము, నిత్యత్వము మరియు అమితత్వము వంటి పంచుకొనజాలని గుణములు లేక అమితమైన గుణములను కూడా కలిగియుంటాడు. మరియు గొప్పవాడైన ఉన్నవాడు,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> కాలములోనికి, లోకములోనికి, మరియు మానవ చరిత్రలోనికి సృష్టములతో అనుబంధము కలిగియుండుటకు ప్రవేశించి వారి స్థాయిలో వారితో అనుబంధపరచుకుంటాడని మనకు తెలియజేయబడింది. అంటే, ఆయన తన సర్వజ్ఞ, అమితమైన, నిత్య స్వభావములలో దేనినైనా విడిచిపెడతాడని దీని అర్థము కాదుగాని, ఆయన వారితో వారి స్థాయిలో అనుబంధం కలిగియుండి — మనము ఒక చిన్న బిడ్డతో వ్యవహరించునట్లు — ఆ స్థాయిలో వారితో సంభాషిస్తాడు. నేను నా వంట గదిలోనికి వెళ్లి అక్కడ పిండి అంతా క్రింద పారబోసి ఉండుట చూసి, "తల్లీ, ఈ పిండికి ఏమైనది?" అని అడుగుతాను. అంటే ఆ పిండికి ఏమి జరిగిందో నాకు తెలుయదని కాదుగాని, ఆ బిడ్డతో ఆ బిడ్డ యొక్క స్థాయిలో నేను మాట్లాడుటకు ప్రయత్నిస్తున్నాను. మరియు ఆయన కృపలో దేవుడు మనతో కూడా అలానే వ్యవహరిస్తాడు. దేవుని అమోఘమైన దయ మనతో ఆయనను ఎంతగా అనుబంధపరుచుకొనుటకు పురికొల్పుతుందంటే, కొన్ని సార్లు ఆయన తన నిత్యమైన అమిత గుణములను విడిచిపెట్టినట్లు అనిపిస్తుంది. కాని అలా ఎన్నడును జరగలేదు. దేవుడు మనలను బహుగా ప్రేమిస్తున్నాడు కాబట్టి మన స్థాయిలో మనతో వ్యవహరిస్తున్నాడు.
>
> — డా. కే. ఎరిక్ థోయెన్స్

మనము అనుదిన జీవితములో అనేక ఇతర విషయములను నేర్చుకొనునట్లు దేవునిని గూర్చి అధ్యయనము చేయలేమని మనందరికీ తెలుసు. ఆయన ఎత్తును మరియు బరువును మనము కొలవలేము, లేక ఒక పరిశోధనా నాళములో ఆయనను పెట్టి పరీక్షించలేము. దీనికి భిన్నముగా, దేవుడు ఎంతో స్వతంత్ర శ్రేష్టత కలిగియుండి, మన కంటే ఎంతో దూరముగా ఉన్నాడు, మరియు ఒక విషయము మినహాయిస్తే ఆయన సంపూర్ణముగా మరుగుచేయబడియున్నాడు: అది పరిశుద్ధాత్మ తనను తాను మానవ పరిభాషలో బయలుపరచుకున్నాడు. క్రమబద్ధ వేదాంతవేత్తలు దీనిని గూర్చి ప్రత్యక్షత యొక్క సుగుణవాద స్వభావము అని మాట్లాడారు. మరొక మాటలో, దేవుడు తనను తాను మానవ రూపములో, లేక మానవులు అర్థము చేసుకొనగల మార్గములలో బయలుపరచుకున్నాడు.

లేఖనములో కనీసం నాలుగు రకముల సుగుణవాద ప్రత్యక్షతలు ఉన్నాయి. అత్యంత క్షుణ్ణమైన భావములో, లేఖనములు చాలా సార్లు దేవుని యొక్క గుణములను మానవ గుణములతో పోల్చుతాయి. దేవునికి కళ్ళు, చెవులు, నాసికా రంధ్రములు, బాహువు, చేతులు, కాళ్లు మరియు పాదములు ఉన్నాయని అనేక బైబిలు వాక్య భాగములు మాట్లాడతాయి. దేవుడు తర్కిస్తాడు, ప్రశ్నలు అడుగుతాడు, ఇతరులతో సంప్రదిస్తాడు, భావనలను కలిగియుంటాడు మరియు విశ్లేషణ కూడా చేస్తాడు. నా వలె మరియు మీ వలె ఆయన కూడా ఒక పనిని చేసి పశ్చాత్తాపపడతాడు. అయితే లేఖనమంతా సంపూర్ణంగా, ఇట్టి సుగుణవాద గుణములను రూపకములుగానే తీసుకోవాలని స్పష్టము చేస్తుంది — దేవుడు మరియు మానవుల మధ్య



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పోలికలు. ప్రజల వలె దేవునికి భౌతికమైన కన్నులు లేక చేతులు లేవు. అయితే, ఆయన చూడగలడని మరియు ఎల్లప్పుడూ కార్యములు చేయగలడని మనకు తెలుసు.

మరికొంత విస్తారమైన భావములో, మానవ సామాజిక కట్టడలకు అనుగుణంగా కూడా లేఖనములు దేవుని సుగుణవాద రూపములో ప్రత్యక్షపరుస్తాయి. ఉదాహరణకు, దేవుడు సృష్టి అంతటి యొక్క సర్వశ్రేష్టమైన రాజు అని బైబిలు తరచుగా మాట్లాడుతుంది. ఆయన తన పరలోక సింహాసనము మీద కూర్చొనియుంటాడు, న్యాయము తీర్చుతాడు, కథనములను వింటాడు, ప్రకటనలు చేస్తాడు, మరియు ఆరాధనను అందుకుంటాడు, మరియు ఇది బైబిలు కాలములో మానవ రాజులు చేసిన పనులను పోలియున్నది.

ఇదే విధముగా, లేఖనము దేవుని ఇశ్రాయేలు యొక్క రాజరిక యుద్ధ వీరునిగాను, ధర్మశాస్త్రమును ఇచ్చిన వానిగాను, నిబంధన చేసినవానిగాను మరియు నిబంధనను నిలబెట్టినవానిగాను చూపిస్తుంది. ఆయన రాజత్వ కాపరిగాను రాజత్వ పెనిమిటిగాను మరియు ఆయన ప్రజలకు తండ్రిగాను ఉన్నాడు. మరొకసారి, కొన్ని విధములలో దేవుడు మానవులను పోలియున్నాడని ఈ ప్రత్యక్షతలు దేవుని గూర్చి చెబుతాయి. పురాతన ప్రపంచములో మానవ రాజులు పరిపాలించిన విధముగా ఆయన పరిపాలించుచున్నాడు.

మరింత విస్తారమైన రీతిలో, చరిత్రలో దేవుని యొక్క దృశ్యమైన ప్రత్యక్షతలు కూడా సుగుణవాదమైనవిగా ఉన్నాయని మనము చెప్పవచ్చు. దేవుడు లోకములో దృశ్యమైన రీతిలో ప్రత్యక్షమైన అనేక సందర్భములను గూర్చి బైబిలు మాట్లాడుతుంది వీటిని మనము చాలా సార్లు — "దేవుని ప్రత్యక్షతలు" లేక థియోఫెని అని పిలుస్తాము. అత్యంత నాటకీయమైన దేవుని ప్రత్యక్షతలు దేవునిని భౌతికమైన పొగ మరియు అగ్ని, మరియు దృశ్యమైన మహిమగల పరలోక మేఘమును గూర్చిన దర్శనములతో అనుబంధపరుస్తాయి. ఇప్పుడు, కొలస్సీ. 1:15 మరియు 1 తిమోతి 1:17 వంటి వాక్యభాగములు దేవుడు స్వయంగా అదృశ్యమైనవాడు అని మనకు తెలియజేస్తాయి. కాబట్టి, దేవుని యొక్క ఈ దృశ్యమైన ప్రత్యక్షతలు కూడా దేవునిని ఆయన తనను తాను ఎరిగిన విధముగా బయలుపరచవు అను భావములో ఇవి కూడా సుగుణవాదమైనవని చెప్పవచ్చు. బదులుగా, మన పరిమితమైన స్తోమతతో మానవమాత్రులమైన మనము ఆయనను అనుభవించు విధముగా అవి దేవుని ప్రత్యక్షపరుస్తాయి.

చివరిగా, అత్యంత విస్తారమైన భావములో, లేఖనములు దేవుని యొక్క విశేషమైన గుణములను ప్రస్తావించునప్పుడు కూడా దేవుని మానవ పరిభాషలో ప్రత్యక్షపరుస్తాయి. దేవుడు నీతిమంతుడు, పరిశుద్ధుడు, బలవంతుడు అని బైబిలు ఆయనను గూర్చి అనేకసార్లు మాట్లాడుతుంది. అయితే దేవునికి మాత్రమే పరిమితమైన ఈ వర్ణనలను బైబిలు రచయితలు మానవ పరిభాషలో కూడా మనకు అర్థమయ్యే విధముగా వివరించారు. కాబట్టి, ఏదో ఒక విధముగా ప్రతి దైవిక ప్రత్యక్షత కూడా సుగుణవాదమైనది అని చెప్పుట సరియైనదే. దేవుడు తనను గూర్చిన సత్యములను మానవులకు బయలుపరచాడు గాని, ఎల్లప్పుడూ మన మానవ పరిమితులకు అనుగుణమైన మార్గములలోనే బయలుపరచాడు.

పరిశుద్ధాత్మ దేవుని ఎల్లప్పుడూ మనకు మానవ పరిభాషలోనే బయలుపరచాడనే విషయమును మనస్సులో ఉంచుకొని, దైవిక ప్రత్యక్షత యొక్క రెండవ మూల భావనను చూద్దాము: దేవుడు తనను తాను సంపూర్ణమైన రీతిలో క్రీస్తులో బయలుపరచుకున్నాడు.

స్పష్టముగా, క్రైస్తవ విశ్వాసములో క్రీస్తు కంటే కేంద్రమైన అంశము మరొకటి లేదు. ఆయన మాత్రమే రక్షకుడును మరియు ప్రభువునైయున్నాడు. మరియు ఆయన మానవ జాతి కొరకు దేవుని యొక్క ఉన్నతమైన స్వయం ప్రత్యక్షతగా ఉన్నాడు. ఇప్పుడు, క్రీస్తు అనుచరులుగా, బైబిలు చరిత్రయంతటిలో దేవుడు తనను తాను అనేక విధములుగా బయలుపరచుకున్నాడని మనము ఒప్పుకుంటాము. కాని కొలస్సీ. 1:15 వంటి వాక్యభాగములు, యేసు మానవ పరిభాషలో దేవుని యొక్క అత్యుత్తమమైన స్వయం ప్రత్యక్షతగా ఉన్నాడని బోధిస్తాయి. యేసు నరావతారిగా వచ్చిన, నిత్య దేవుని కుమారుడును, పూర్ణమైన మానవ రూపమును మరియు దేవుని ప్రతినిధియునైయున్నాడు. మరియు ఈ కారణము చేత, దేవునిని గూర్చి మనము విశ్వసించు ప్రతిది యేసులో దేవుని యొక్క ఉన్నతమైన ప్రత్యక్షతకు అనుగుణంగా ఉండాలి — ఆయన బోధలలో, మరియు ఆయన జీవితము, మరణము, పునరుత్థానము, ఆరోహణము, మరియు మహిమగల రకాడ యొక్క ప్రాముఖ్యతలో కూడా.

దైవిక ప్రత్యక్షతను గూర్చి ఈ మూల భావనను మనస్సులో పెట్టుకొని, దేవుని నుండి వచ్చు పలు రకముల ప్రత్యక్షతను పరిగణిస్తూ దేవుని యొక్క స్వయం-ప్రత్యక్షతను మరింత స్పష్టముగా చూడాలి.

## రకములు

మనము ముందు చెప్పినట్లు, యేసు దేవుని యొక్క అత్యున్నతమైన ప్రత్యక్షతగా ఉన్నాడు. అయితే క్రొత్త నిబంధనలో, ఆయన మాత్రమే దేవుని యొక్క ఏకైక స్వయం-ప్రత్యక్షత కాదని యేసు స్పష్టం చేశాడు. బదులుగా, దేవుడు తనను తాను అనేక విధములుగా ప్రత్యక్షపరచుకున్నాడని ఆయన ఉద్ఘాటించాడు.

> మొదటిగా, ఆయన తనను తాను ప్రత్యక్షపరచుకొననిదే మనము దేవుని గూర్చి తెలుసుకోలేము, మరియు ఆయన దీనిని అనేక విధములుగా, మన చుట్టూ ఉన్న సృష్టి మరియు దానిలోని అద్భుతముల ద్వారా ప్రత్యక్షపరచుకుంటాడు. దేవునిని గూర్చి తాము నేర్చుకొన్న విషయములను గూర్చి మనతో మాట్లాడు ఇతర ప్రజలతో మనము కలిగియుండు అనుబంధముల ద్వారా కూడా ఆయన తనను తాను బయలుపరచుకుంటాడు. దేవుని యొక్క ఈ ప్రత్యక్షతను మనము అనేక స్థాయిలలో పొందుకుంటాము. అవును, దేవుడు తనను తాను మన కొరకు ఆయన పరిశుద్ధ వాక్యము ద్వారా బయలుపరచుకున్నాడు అనునది క్రైస్తవులకు అత్యంత ప్రాముఖ్యమైనది... కాబట్టి, మనము చుట్టూ చూసి దేవుడు మనకు బయలుపరచుకొనిన విధానమును చూస్తాము, ఆయన ఉనికిలో ఉన్నాడని మనకు తెలుసు, మరియు ఆయనను గూర్చి, ఆయన శిష్యుల ద్వారా, మరియు నేటికి ఆయన పరిశుద్ధ వాక్యము ద్వారా బయలుపరచుకుంటాడు.

— డా. జెఫ్రీ మూర్

యేసు స్వయంగా గుర్తించిన రెండు రకముల దైవిక ప్రత్యక్షతలను క్రమబద్ధ వేదాంతశాస్త్రము తరచుగా గుర్తిస్తుంది. మొదటి రకమును సాధారణ లేక స్వాభావిక ప్రత్యక్షత అని పిలుస్తారు.

సాధారణ ప్రత్యక్షత. సులువైన మాటలలో, సాధారణ ప్రత్యక్షత అనే పదము దేవుడు తనను తాను సృష్టి యొక్క ప్రతి అనుభవము ద్వారా మానవులకు ప్రత్యక్షపరచుకున్నాడు అనే బైబిలు బోధనను సంబోధిస్తుంది. 19వ కీర్తన వంటి అనేక పాత నిబంధన లేఖన భాగములకు అనుగుణంగా, చాలా సార్లు యేసు స్వయంగా సాధారణ ప్రత్యక్షత నుండి వేదాంత పాఠములను బోధించాడు. ఆయన చాలాసార్లు దేవునిని గూర్చి బోధించుటకు ప్రకృతిని మరియు సామాన్య మానవ కార్యములైన వ్యవసాయము మరియు చేపలను పట్టుట వంటి పనులను ఉపయోగిస్తాడు. వాస్తవానికి, వారి జీవిత అనుభవముల నుండి దేవుని గూర్చి ఏమి నేర్చుకొనవచ్చో వివేచించుటకు తమ లోపలికి మరియు చుట్టుప్రక్కల చూడమని ఆయన మరలా మరలా శిష్యులను ప్రోత్సహించాడు.

అపొ. 14:17 మరియు 17:28లో మనము ఇలాంటి విషయమునే చూస్తాము. ఈ వచనములలో, అపొస్తలుడైన పౌలు క్రీస్తు యొక్క ఉదాహరణను అనుసరించి సాధారణ ప్రత్యక్షతను ఉపయోగించాడు. ఇక్కడ, ప్రకృతి మరియు గ్రీకు పద్య భాగము యొక్క విశ్లేషణ ద్వారా అన్యజనులకు దేవుని గూర్చి తెలిసిన విషయముల వైపుకు ఆయన చూపాడు.

లేఖనములలో రోమా పత్రిక 1 మరియు 2 అధ్యాయములు సాధారణ ప్రత్యక్షతను గూర్చి స్పష్టమైన వివరణను ఇస్తాయి. దేవుని గూర్చిన వేదాంతశాస్త్రమును అధ్యయనము చేయుచుండగా మనము దృష్టిలో ఉంచుకోవలసిన భావార్థకమైన మరియు అభావార్థకమైన అభిప్రాయముల వైపు ఈ అధ్యాయములు మన దృష్టిని ఆకర్షిస్తాయి. భావార్థకముగా, దేవుని సృష్టిలో జీవిత అనుభవముల ద్వారా దేవుని గూర్చి మనము అనేక విషయములను నేర్చుకొనవచ్చని రోమా పత్రిక 1 మరియు 2 అధ్యాయములు బోధిస్తాయి. రోమా. 1:20లో పౌలు చెప్పిన మాటలను వినండి:

> **ఆయన అదృశ్య లక్షణములు — అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును — జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి. . . (రోమా. 1:20)**

ఈ అధ్యాయములను మనము దగ్గరగా చూసినప్పుడు, "సృష్టించబడినవి" ప్రకృతి క్రమము కంటే ఉన్నతముగా ఉన్నాయని మనము చూస్తాము. మానవ సంస్కృతిలో నుండి, స్వయంగా మానవుల నుండి, మరియు మన సొంత వ్యక్తిగత అంతరంగ జీవితముల నుండి — మన నైతిక మనసాక్షి, అంతర్బుద్ధి, పూర్వసంకేతములు మొదలగు వాటి నుండి — దేవుని గూర్చి మనము నేర్చుకొను విషయములు కూడా పౌలు దృష్టిలో ఉన్నాయి.

> సాధారణ ప్రత్యక్షత అనేది ఎంతో ప్రాముఖ్యమైన వేదాంత భావన అని నేను అనుకుంటాను, ఎందుకంటే అది ఒక తిరస్కరించరాని విషయమైయున్నది. మనమంతా ఈ లోకములో నివసిస్తాము; క్రైస్తవులమైనా కాకపోయినా, మనమంతా దేవుడు సృష్టించిన లోకములో నివసిస్తున్నాము. ఇప్పుడు క్రైస్తవేతరుడు దీనిని గుర్తించుట లేక గుర్తించకపోవుట అనేది మరొక విషయము. కాని సృష్టిలో, మనము "సాధారణ ప్రత్యక్షత" అని పిలచు దానిలో, మన చుట్టూ మనము చూచు వాటిలో, కేవలం సృష్టిని చూచుట ద్వారా దేవుడు ఎవరో మనము చూడగలుగుతాము. మనము బలమైన దేవుని కలిగియున్నామని ఆయన గ్రహములను, నక్షత్రములను మరియు చంద్రుని చేశాడను సత్యములో చూడగలము. మన దేవునికి సౌందర్యమును వీక్షించగల కన్నులు ఉన్నాయి మరియు అందముగా ఉన్నవాటిని ఆయన గుర్తిస్తాడు. దీనిని మనము జంతువులు, చెట్లు, మరియు సుర్యాస్తమయములో చూడగలము. ఒక సింహములో దేవుని యొక్క మహత్యమును మనము చూడగలము. మనము చూచు ప్రతి చోట ఆయన స్వభావము మనకు స్పష్టముగా కనబడుతుంది. ఇప్పుడు, ఇది చాలా ప్రాముఖ్యమైన విషయము, ముఖ్యముగా ఒక సువార్త ప్రకటన దృష్టి కోణం నుండి, ఎందుకంటే మనము ఆరంభించుటకు ఒక బిందువు కావాలి, మరియు సాధారణ ప్రత్యక్షత ఆ ఆరంభ బిందువును మనకు ఇస్తుంది. మనము నివసించు ప్రపంచమును గూర్చి మనకు కొన్ని విషయములు తెలుసు, కాబట్టి మన చుట్టూ చూచుట ద్వారా లోకమును సృష్టించిన దేవుని కూడా చూడవచ్చు.
>
> — రెవ. రిక్ రోడ్జీవర్

శతాబ్దముల తరబడి, సాధారణ ప్రత్యక్షతను గూర్చిన ఈ భావార్థకమైన దృష్టికోణము "ప్రాకృతిక వేదాంతశాస్త్రము" అను రూపములో దేవుని గూర్చిన సిద్ధాంతములో ఎంతో ముఖ్యమైన పాత్రను పోషించింది. ప్రాకృతిక వేదాంతశాస్త్రము సాధారణ ప్రత్యక్షత ద్వారా దేవుని గూర్చి నేర్చుకొనుటకు కొనసాగుచున్న ప్రయత్నమైయున్నది. ప్రాకృతిక వేదాంతశాస్త్రము ద్వారా దేవుని గూర్చి ఎంతో నేర్చుకొనవచ్చని క్రీస్తు అనుచరులు ఎల్లప్పుడు గుర్తించారు. మరియు కొన్ని అరుదైన మినహాయింపులతో, దేవుని సిద్ధాంతము మీద అధికారిక వేదాంతశాస్త్ర విశ్లేషణలు సంఘము యొక్క అన్ని శాఖలలో కూడా ప్రాకృతిక వేదాంతశాస్త్రమును చేర్చాయి.

వాస్తవానికి, మధ్యకాలిక యుగములోని ప్రఖ్యాతిగాంచిన ఛాత్రవాద వేదాంతవేత్తలు ప్రాకృతిక వేదాంతశాస్త్రమును నేర్చుకొనుటకు ఒక అధికారికమైన మూడింతల ప్రణాళికను నిర్మించారు. మొదటిగా, వారు "సకారణత్వ మార్గము"లో మాట్లాడారు — ల్యాటిన్ లో *వయ కాసలిటాటిస్.* దీని ద్వారా వారి అర్థము, దేవుడు సృష్టించిన లేక ఆయన సృష్టిలో "ఉనికిలోకి తెచ్చిన" మంచి విషయములను పరిశీలించుట ద్వారా దేవుని గూర్చిన సత్యములను నేర్చుకోవచ్చు. ఉదాహరణకు, దేవుడు లోకములో అందమును మరియు

క్రమమును సృష్టించాడని మనము చూడవచ్చు. కాబట్టి, దేవుడు స్వయంగా అందమైనవాడును క్రమము కలవాడును అని మనము నిర్ధారించవచ్చు.

రెండవదిగా, ఛాత్రవాదులు "నిరాకరణ మార్గము"ను గూర్చి కూడా మాట్లాడారు — ల్యాటిన్ భాషలో *వయ నెగషియోనిస్.* దీని ద్వారా వారి అర్థము, దేవుని సృష్టి యొక్క పరిధులు మరియు అపరిపూర్ణతలతో పోల్చుట ద్వారా ఆయనను గూర్చిన సత్యములను నేర్చుకోవచ్చు. ఉదాహరణకు, సృష్టి కాల పరిమితి కలిగినది, కాని దేవుడు నిత్యుడైనవాడు. సృష్టి స్థాన పరిమితి కలిగినది, కాని దేవుడు అమితమైనవాడు.

మరియు మూడవదిగా, మధ్యకాలిక ఛాత్రవాదులు "ఔన్నత్య మార్గము"లో కూడా మాట్లాడతారు — ల్యాటిన్ భాషలో *వయ ఎమినెన్షియ.* దీని ద్వారా వారి అర్థము, ఆయన సృష్టించిన మంచి విషయముల కంటే దేవుడు ఎల్లప్పుడు గొప్పవాడైయున్నాడు అని గుర్తించుట ద్వారా సాధారణ ప్రత్యక్షత నుండి దేవుని గూర్చిన సత్యములను నేర్చుకోవచ్చు. ఉదాహరణకు, ప్రకృతి యొక్క శక్తి మనలను దేవుని యొక్క ఉన్నతమైన శక్తిని నమ్మునట్లు పురికొల్పుతుంది. మానవ జ్ఞాన సామర్థ్యములు మనలను దేవుని యొక్క అసమానమైన శక్తిని నమ్మునట్లు చేస్తాయి.

చాలా వరకు, నేడు ఇవాంజెలికల్ క్రైస్తవులు ఇట్టి కఠినమైన పద్ధతులను అనుసరించరు, కాని ప్రాకృతిక వేదాంతశాస్త్రము నేటికి దేవుని గూర్చిన వేదాంతశాస్త్రములో ప్రాముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. సృష్టిలో మన అనుభవము యొక్క ప్రతి కోణమును ఆయనను గూర్చిన విషయములను బయలుపరచుటకు దేవుడు రూపించాడని యేసు ఆయన అనుచరులకు బోధించాడు. మరియు, క్రీస్తు యొక్క నమ్మకమైన ప్రజలుగా, సాధారణ ప్రత్యక్షత ద్వారా దేవునిని గూర్చి మనము నేర్చుకొనదగిన సమస్తమును వెదకుటకు మనము ఆతురత కలిగియుండాలి.

దేవుని గూర్చిన వేదాంతశాస్త్రమును గూర్చి ఏ అధ్యయనము కొరకైనా సాధారణ ప్రత్యక్షత మరియు ప్రాకృతిక వేదాంతశాస్త్రము యొక్క భావార్థక అభిప్రాయములు ఎంతో ప్రాముఖ్యమైనవి. కాని, రోమా పత్రికలోని మొదటి రెండు అధ్యాయములు కొన్ని కీలకమైన అభావార్థక అభిప్రాయములను ఎలా అందిస్తున్నాయో కూడా మనము పరిగణించాలి. రోమా. 1:18లో, ఇలా వ్రాసినప్పుడు పౌలు సాధారణ ప్రత్యక్షత యొక్క అభావార్థక అభిప్రాయములను వక్కాణించాడు.

> **దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది (రోమా. 1:18).**

ఈ వచనములో, సాధారణ ప్రత్యక్షత దేవుని యొక్క కరుణ మరియు రక్షణ మార్గమునకు బదులుగా "దేవుని ఉగ్రత"ను బయలుపరుస్తుందని పౌలు వివరించాడు. మరియు ఇది నిజము ఎందుకంటే, చాలాసార్లు, పాపిష్టి ప్రజలు తమ "భ్రష్టత్వము" ద్వారా సాధారణ ప్రత్యక్షతలోని "సత్యమును అణచివేస్తారు." వాస్తవానికి, రోమా. 1:25 ప్రకారం:

> **[పాపులు] దేవుని సత్యమును అసత్యమునకు మార్చి(రి) . . . (రోమా. 1:25).**



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పాపిష్టి ప్రజలు తమ జీవిత అనుభవములలో నుండి దేవుని గూర్చి నేర్చుకోవలసిన విషయములను నేర్చుకొనుటలో చాలా సార్లు విఫలులవుతారని యేసు స్వయంగా సూచించాడు. యేసు మరియు పౌలు ప్రకటించిన విధంగా, దేవుడు సృష్టిలో బయలుపరచిన విషయములను గూర్చి పాపిష్టి ప్రజలు తమకు తాము మరియు ఇతరులకు కూడా అబద్ధము చెప్పు వాంఛను కలిగియున్నారు.

> ప్రాకృతిక వేదాంతశాస్త్రము అనే విభాగము ద్వారా మనము దేవుని గూర్చి ఏమి నేర్చుకోగలము అనే విషయమును గూర్చి నేను చాలా జాగ్రత్త వహించాలని ఆశ పడుచున్నాను. ఆయన మహత్వము మరియు ఆయన శక్తిని గూర్చి మాట్లాడు రోమా. 1:20లో ఉన్న కథనము మీద నేను ఆధారపడాలని ఆశించుచున్నాను. మనము నేర్చుకొనవలసిన విషయముల కొరకు ఇలాంటి విషయముల మీద ఆధారపడవచ్చని నేను ఆలోచిస్తున్నాను. కాని వెంటనే సరైన దృష్టికోణము కలిగియుండుటకు మనకు విశేష ప్రత్యక్షత ఎంతో అవసరమైయున్నదని కూడా నేను చెప్పాలని ఆశించుచున్నాను... కాబట్టి, మానవ తర్కమును పరీక్షించుటకు మీకు విశేష ప్రత్యక్షత కావాలి — అనగా స్వతంత్ర మానవ తర్కము కావాలి. ఎందుకంటే సమస్యాత్మకముగా అధ్యయనము చేయు మరియు అర్థము చేసుకొను కొన్ని విషయములను కూడా సృష్టి అందిస్తుంది. ప్రభువైన యేసు క్రీస్తు యొక్క సత్యమును గూర్చిన విశేష ప్రత్యక్షత దేవునిని గూర్చి ఖచ్చితముగా బోధిస్తుంది. మన తర్కమును సరియైన మార్గములో ఉంచుటకు ఆయన వాక్యముతో సంప్రదించుట — ఎంతో అవసరమైయున్నది.
>
> — డా. బ్రూస్ ఎల్. ఫీల్డ్స్

> దేవుని సృష్టి మనకు అనేక విషయములను బోధిస్తుంది... కాని, అత్యంత మౌలికముగా, ఆయన సార్వభౌమ సృష్టికర్త అని అది మనకు బోధిస్తుంది. దేవుడు సమస్తమును శూన్యములో నుండి ఉనికిలోనికి తెచ్చువాడు కాబట్టి అది మనకు ఆయన శక్తిని గూర్చి కూడా బోధిస్తుంది. రోమా పత్రిక 1వ అధ్యాయం ప్రకారం, అది మనకు ఆయన నీతిని గూర్చి కూడా బోధిస్తుంది. దేవుడు ఉన్నాడని, ఆయనను ఆరాధించాలని మానవులందరికీ తెలుసు అని, మరియు అందరికీ దేవుని యొక్క నీతి మరియు పరిశుద్ధతను గూర్చిన అవగాహన ఉన్నదని రోమా పత్రిక 1వ అధ్యాయములో మనము వింటాము. పాపిష్టి ప్రజలుగా మనము దానిని అణచివేస్తాము; దానిని నిర్లక్ష్యం చేయుటకు ప్రయత్నిస్తాము. కాబట్టి, దేవుడు సృష్టికర్తయైయున్నాడని సృష్టి మనకు బోధిస్తుంది; ఆయన శక్తివంతుడు మరియు ఆయన నీతిమంతుడు. పాపిష్టి మానవులుగా మనము ఆ విషయములను నిరాకరించుటకు మరియు అణచివేయుటకు ప్రయత్నిస్తాము. కాబట్టి, ఆయనతో మనము సరియైన సంబంధములోనికి ఎలా రావాలి అనేది సృష్టి మనకు బోధించని



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

విషయము. నేను ఇక్కడ చెప్పిన విషయములను సృష్టి మనకు బోధిస్తుంది, కాని అది ప్రభువైన యేసు క్రీస్తులో దేవుని కృప మరియు కరుణను గూర్చి మనకు బోధించదు. ప్రభువైన యేసు క్రీస్తు యొక్క క్రియలలో దానిని గూర్చి ఒక అనుబంధ ప్రత్యక్షత అవసరమైయున్నది.

— డా. కార్ల్ ఆర్. ట్రూమాన్

సాధారణ ప్రత్యక్షత మీద ఈ అభావార్ధక అభిప్రాయములు ప్రాకృతిక వేదాంతశాస్త్రము మీద అతిగా ఆధారపడుటను గూర్చి ఒక అవసరమైన హెచ్చరికను ఇస్తాయి. ప్రాకృతిక వేదాంతశాస్త్రము తప్పిదములు లేనిది కాదు ఎందుకంటే ఆయన సృష్టిని గూర్చి మనము కలిగియున్న అనుభవముల నుండి దేవుని గూర్చి నేర్చుకొను మన అధ్యయన సామర్థ్యమును పాపము కలుషితము చేసింది. నిజాయితీ గల క్రైస్తవ వేదాంతవేత్తల యొక్క ఉత్తమైన కృషి తరువాత కూడా, ప్రాకృతిక వేదాంతశాస్త్రము తరచుగా సాధారణ ప్రత్యక్షతను తప్పుగా నిర్మించింది మరియు దేవుని గూర్చి మనము కలిగియున్న భావనలోనికి తప్పిదములను పరిచయం చేసింది.

ఉదాహరణకు, సంఘ పితరుల కాలములో మరియు మధ్యకాలిక యుగములో, అన్య గ్రీకు మత మార్మికవాదము దేవునిని గూర్చి మానవులు ఏమి కూడా నేర్చుకొనలేరు అనే అభిప్రాయములోనికి అనేకులను నడిపించింది. పద్దెనిమిదవ శతాబ్దములో, ప్రకృతి క్రమమును గూర్చి అపార్థములు అనేక మంది వేదాంతవేత్తలను జ్ఞానోదయ దైవవాదమును — దేవుడు లోకములోని విషయములను పట్టించుకోడు అనే నమ్మకము — హత్తుకొనునట్లు చేసింది. ఈ మధ్య శతాబ్దములలో, జీవశాస్త్ర వైజ్ఞానిక పరిశోధనలు సృష్టికర్తగా దేవుని చూపు బైబిలు అవగాహనను అనేకమంది తిరస్కరించునట్లు చేశాయి. ప్రతి మలుపులో కూడా, మానవ హృదయము యొక్క కాఠిన్యము సాధారణ ప్రత్యక్షతలో దేవుని గూర్చి బయలుపరచబడిన సత్యములను మరచిపోవునట్లు వేదాంతవేత్తలను నడిపించింది.

అవును, ప్రాకృతిక వేదాంతశాస్త్రము మీద ఈ అభావార్ధక అభిప్రాయములు ఒక ముఖ్యమైన ప్రశ్నకు దారితీసాయి: పాపము సాధారణ ప్రత్యక్షతను గూర్చి మనము కలిగియున్న అవగాహనను కలుషితము చేసిన యెడల, దేవుని గూర్చిన సత్యమును మనము ఎలా తెలుసుకోగలుగుతాము?

ఈ ప్రశ్నకు జవాబిచ్చుటకు దైవిక ప్రత్యక్షత యొక్క రెండవ ముఖ్య రకమును ఇప్పుడు చూద్దాము. సాధారణ ప్రత్యక్షతతో పాటుగా, దేవుడు మనకు ప్రత్యేకమైన లేక విశేష ప్రత్యక్షతను ఇచ్చాడని యేసు బోధించాడు.

విశేష ప్రత్యక్షత. విస్తారమైన రీతిలో మాట్లాడితే, విశేష ప్రత్యక్షత అనగా అసామాన్యమైన రీతులలో దేవుడు తనను తాను బయలుపరచుకొనుట. పరిశుద్ధాత్మ కలల ద్వారా, దర్శనముల ద్వారా, స్వరముల ద్వారా, మరియు ఆయన యొక్క గొప్ప రక్షణ మరియు న్యాయ కార్యముల ద్వారా ప్రత్యక్షతను ఇచ్చాడు. ప్రేరేపించబడిన మానవ ప్రతినిధుల ద్వారా కూడా దేవుడు తనను తాను బయలుపరచుకున్నాడు —



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పరిశుద్ధాత్మ ద్వారా ప్రేరేపించబడిన ఆయన ప్రవక్తలు మరియు అపొస్తలులు. మరియు అవును, మనము ముందు చెప్పినట్లు, దేవుని యొక్క అతి గొప్ప వ్యక్తిగత ప్రత్యక్షత క్రీస్తులో కలిగినది.

దేవుని సిద్ధాంతమునకు విశేష ప్రత్యక్షత యొక్క ప్రాముఖ్యతను గూర్చి ఎక్కువగా చెప్పవలసిన అవసరం లేదు. అది దేవుని ఉద్దేశములకు ఎంత ప్రాముఖ్యమైనదంటే లోకములోనికి పాపము ప్రవేశించక మునుపు కూడా, దేవుడు ఆదాము హవ్వలను విశేషమైన స్వర ప్రత్యక్షత ద్వారా నడిపించాడు. మరియు, అవును, పాపము చేసిన తరువాత కూడా విశేష ప్రత్యక్షత ఎంతో కీలకమైనదిగా ఉండినది. అది సాధారణ ప్రత్యక్షతను అర్థము చేసుకొనుటకు మనము చేయు ప్రయత్నములను నడిపించుట మాత్రమే గాక, అది నిత్య రక్షణ మార్గమును కూడా బయలుపరుస్తుంది.

దేవుడు అసామాన్యమైన ప్రత్యక్షతను — లోకములోనికి పాపము రాక మునుపు మరియు వచ్చిన తరువాత కూడా — మనకు ఇచ్చుట ఎంత అద్భుతమైన విషయమైనప్పటికీ, మనము "దేవుని నుండి విశేష ప్రత్యక్షత" అని పిలుచుకొనునది కొన్ని వేల సంవత్సరముల క్రితం సంభవించినది. కాబట్టి, నేడు విశేష ప్రత్యక్షత ద్వారా మనము దేవుని గూర్చి ఎలా నేర్చుకోగలము?

మరొక సారి, దేవుని యొక్క అత్యున్నత ప్రత్యక్షతయైన యేసు ఏమి బోధించాడో మనము చూడాలి. క్లుప్తంగా, లేఖనములో ఉన్న దేవుని విశేష ప్రత్యక్షత యొక్క ఆధీనములో ఉండమని క్రీస్తు ఆయన అనుచరులకు బోధించాడు. మార్కు 12:28-34 వంటి వాక్యభాగములు యేసు, ఆయన కాలములోని ఇతర పాలస్తీన రబ్బీల వలె, పాత నిబంధనను దేవుని యొక్క వ్రాయబడిన విశేష ప్రత్యక్షతగా పరిగణించాడని స్పష్టముగా బోధిస్తున్నాయి.

మరియు క్రొత్త నిబంధన కూడా దేవుని యొక్క ప్రేరేపిత ప్రత్యక్షత అని మనకు తెలుసు. యోహాను 16:12-13, మరియు ఎఫెసీ. 2:20 వంటి చోట్ల, పరలోకములోనికి యేసు ఆరోహణమైన తరువాత, సంఘమునకు దేవుని బయలుపరచుటకు మొదటి శతాబ్దపు అపొస్తలులను మరియు ప్రవక్తలను బలపరచుటకు ఆయన పరిశుద్ధాత్మను పంపాడు. క్రొత్త నిబంధన ఈ మొదటి శతాబ్దపు అపొస్తలుల మరియు ప్రవక్తల విశేష ప్రత్యక్షతల యొక్క ప్రాతినిధ్య సంపుటిగా ఉన్నది. చరిత్ర అంతటిలో సాధారణ ప్రత్యక్షత మరియు విశేష ప్రత్యక్షతలో దేవుడు బయలుపరచినవాటిని విపేచించుటకు లేఖనము మీద ఆధారపడవచ్చునని ఇవాంజెలికల్ క్రైస్తవులు ఇందుకే చెబుతారు.

దేవుని ప్రత్యక్షత మరియు మర్మములను గూర్చి ఈ మన అధ్యయనములో, దేవుని గూర్చి మనము ఎరిగిన ప్రతి విషయమునకు మూలము దైవిక ప్రత్యక్షత అని మనము చూశాము. ఇప్పుడు, ఈ విషయము యొక్క మరొక కోణమును చూద్దాము. దైవిక మర్మములు — దేవుని గూర్చి మరుగు చేయబడియున్న అనేక విషయములు — దేవుని గూర్చిన పేదాంతశాస్త్రము యొక్క మన అధ్యయనమును ఎలా ప్రభావితము చేస్తాయి?



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## దైవిక మర్మములు

> మనము కనుగొనుటకు ప్రయత్నించవలసిన ఒక విషయం, మరియు కనుగొనుటకు కష్టమైన విషయం, నిజముగా దేవుడు ఎవరో తెలుసుకొనుట. ఆయన స్వతంత్ర శ్రేష్టత గలవాడు; ఆయన సృష్టికి వెలుపల ఉన్నవాడు. ఈ లోకములో మనము అనుభవించు ప్రతిదానిని ఆయన సృష్టించాడు, కాబట్టి ఆయన తనను తాను బయలుపరచుకొననిదే, ఆయన ఏదో ఒక విధంగా సృష్టిలోనికి ప్రవేశించనిదే, ఆయనను మనము తెలుసుకొనలేము. ఆయన మనతో మాట్లాడతాడు; తనను తాను మనకు బయలుపరచుకొంటాడు, మరియు ఆయన కుమారుని ద్వారా సంపూర్ణంగా బయలుపరచుకున్నాడు. కాని అది ఆయనను మనకు నిగూఢమైనవానిగా చేస్తుంది. మరియు వాస్తవానికి, దేవుని రాజ్యమును, ఆయన రాజ్య పాలనను మరియు ఆయన పరిపాలనను మనము తెలుసుకొనగల ఏకైక మార్గము — ఎందుకంటే మనము ఇక్కడ నివసించుటకు ఆయన అవకాశం ఇస్తాడు, మరియు ఆయన అదృశ్యమైనవానిగా ఉన్నాడు — ఆయన తనను తాను మనకు బయలుపరచుకొనుటయే.
>
> — డా. రిక్ బొయిడ్

మనము ఇంతకు ముందు చూసినట్లుగా, మానవులకు మరియు ఆయనకు మధ్య ఉన్న గొప్ప దూరమును దేవుడు అధిగమించాడు. సాధారణ మరియు విశేష ప్రత్యక్షత ద్వారా మనము ఆయనను తెలుసుకొనుటను ఆయన సాధ్యపరచాడు. కాని అదే సమయములో, దేవుని గూర్చి మనము కలిగియున్న జ్ఞానము దైవిక మర్మములచే ప్రభావితము చేయబడింది. దేవుడు తనను గూర్చి తాను అనేక విషయములను బయలుపరచుకొనలేదు.

దేవుని గూర్చిన వేదాంతశాస్త్రమును అధ్యయనం చేయునప్పుడు దైవిక మర్మములను అర్థము చేసుకొనుట ఎంతో ప్రాముఖ్యమైన విషయము కాబట్టి, దీనిని రెండు మెట్లలో చూచుట సహాయకరంగా ఉంటుంది. మొదటిగా దైవిక మర్మములను గూర్చిన మూల భావనను వివరించుదాము. తరువాత, దేవుని సిద్ధాంతమును అధ్యయనం చేయుచుండగా మనము ఎదుర్కొను మర్మముల రకములను మనము చూద్దాము. దైవిక మర్మముల యొక్క మూల భావన ఏమిటి?

### మూల భావన

"మర్మము" అనే పదము లేఖనములో అనేక విధములుగా ఉపయోగించబడింది, కాని మన ఉద్దేశముల కొరకు, దైవిక మర్మములను గూర్చి మనము ఈ విధంగా చెప్పవచ్చు:

> దేవుని గూర్చి మన అవగాహనను పరిమితము చేయు లెక్కలేనన్ని, బయలుపరచబడని దేవుని గూర్చిన సత్యములు.

ఈ నిర్వచనము యొక్క రెండు కోణములను మనము ఎత్తి చూపుదాము. మొదటి కోణము ఏమనగా, దైవిక మర్మములు "లెక్కలేనన్ని, బయలుపరచబడని దేవుని గూర్చిన సత్యములు" అనే వాస్తవము. రోమా. 11:33లో, మనము ఎల్లప్పుడు దైవిక మర్మములను గూర్చి అవగాహన కలిగియుండాలని అపొస్తలుడైన పౌలు చెబుతున్నాడు. ఆయన ఇలా వ్రాస్తాడు:

> **ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము;**
>
> **ఆయన తీర్పులు శోధింపనెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు. (రోమా 11:33).**

ఈ వచనమునకు ముందు ఉన్న అధ్యాయములలో, పౌలు సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలో నుండి దేవుని గూర్చి అనేక దృఢమైన నమ్మకములను వెలికితీశాడు. కాని, ఈ వాక్య భాగములో పౌలు దేవుని బుద్ధి జ్ఞానముల యొక్క "బాహుళ్యము"ను గూర్చి తెలియజేశాడు. మరియు దేవుని తీర్పులు శోధింపనెంతో అశక్యములనియు ఆయన మార్గములెంతో అగమ్యములనియు అతడు ఒప్పుకున్నాడు. దైవిక ప్రత్యక్షత ద్వారా పౌలు దేవుని గూర్చి ఎంతగానో తెలుసుకున్న తరువాత కూడా, అతడు లెక్కలేనన్ని మర్మములను, అనగా దేవుని ఆత్మ బయలుపరచని విషయములను కూడా ఎదుర్కొన్నాడు.

> మనము కలిగియున్న అవగాహనను లేక జ్ఞానమును మించియున్నాడు కాబట్టి దేవుడు నిగూఢమైనవాడు. కొన్ని సార్లు మనతో సంప్రదించకుండా ఆయన కార్యములు చేస్తాడు. ఆయన ఎల్లప్పుడు మనతో సంప్రదించకుండా కార్యములు చేస్తాడుగాని, కొన్నిసార్లు ఆయన కార్యములు చేయు విధానమును వివేచించుట మనకు కష్టమవుతుంది. దేవుని జ్ఞానమును ఎవరు కూడా సంపూర్ణంగా అర్థము చేసుకోలేరు అనే దృష్టికోణములో కూడా ఆయన ఊహకు అందనివానిగా ఉన్నాడు. ఆయన సృష్టించబడినవాడు కాక దేవుడైయున్నాడు కాబట్టి ఆయనలో నిగూఢమైన విషయములు ఉంటాయి... కాబట్టి దేవుని నిగూఢత్వము విషయములో మనలను ఇబ్బంది పెట్టదగినది ఏమియు లేదు. దేవుని యొక్క నిగూఢత్వము యొక్క అర్థము ఆయనను మనము చేరలేమని కాదు. ఆయన మనలను ప్రేమించడని మరియు మనము ఆయన ప్రేమను అనుభవించలేమని కూడా దీని అర్థము కాదు. దీని అర్థము వీటిలో ఏది కూడా కాదు. వాస్తవానికి, ఆయన నిగూఢమైనవానిగా లేనట్లయితే, ఆయన దేవుడైయుండేవాడు కాదని మనము చెప్పవచ్చు; నిగూఢత్వము లేని దేవుడు మనకు ఎందుకు కావాలి... ఆయనను గూర్చి మనకు సమస్తము తెలియదు గాని, ఆయనను గూర్చిన సత్యములు మనకు తెలుసు. ఆయనను మనము పూర్తిగా అర్థము చేసుకోలేము గాని, ఒక అస్పష్టమైన తార్కిక నియమమును గాక దేవుని మేము ఎరిగియున్నాము అని చెప్పు విధముగా ఆయనను మనము ఎరిగియున్నాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

— డా. విలియం ఎడ్గార్

1797-1878 మధ్య కాలములో నివసించి, ప్రిన్స్టన్ థియోలాజికల్ సెమినరీలో క్రమబద్ధ వేదాంతశాస్త్రమును బోధించిన చార్లెస్ హడ్జ్ దైవిక మర్మములను అద్భుతమైన రీతిలో క్రోడీకరించాడు. అతడు వ్రాసిన *సిస్టమాటిక్ థియోలాజి* యొక్క మొదటి వాల్యూం, మొదటి భాగం, నాల్గవ అధ్యాయములో ఇలా వ్రాశాడు:

> మన ఆలోచనకు మించినంతగా దేవునిలో ఎన్నో అమితమైన విషయములు ఉన్నాయి; మరియు మనము తెలుసుకొనియున్న విషయములను, అసంపూర్ణంగా తెలుసుకొనియున్నాము.

హడ్జ్ ఇక్కడ రెండు ముఖ్యమైన పరిశీలనలను చేశాడు. మొదటిగా, "మన ఆలోచనకు మించినంతగా అమితమైన విషయములు" దేవునిలో ఉన్నాయని అతడు సూచించాడు. ఆయనలో కొన్ని మర్మములు, లేక చాలా మర్మములు మాత్రమే లేవు. బదులుగా, దేవుడు స్వయంగా అమితమైన వానిగా ఉన్నాడు కాబట్టి, మనము ఊహించలేనన్ని అమితమైన మర్మములు ఆయనలో ఉన్నాయి. దైవిక మర్మములు మన అవగాహనను ఎంతగా చొచ్చుకుపోతాయంటే "[దేవుని గూర్చి] మనము ఎరిగియున్న విషయములను కూడా అసంపూర్ణంగా ఎరిగియున్నాము" అని హడ్జ్ వివరించాడు. మరొక మాటలో, దేవుని గూర్చి మనము పూర్తిగా అర్థము చేసుకోగల ఒక్క విషయము కూడా లేదు.

> కొన్ని సార్లు దేవుని అర్థం చేసుకొనుట కష్టమని ఎవరైనా అంటే, దానిని మనము నిరాకరిస్తూ ఇలా అంటాము — సరే, నేను ఆయనను తెలుసుకోలేనా? నేను ఆయనను ఎరుగలేనా? మరియు అవును, బైబిలు దేవుని యొక్క స్వయం ప్రత్యక్షతగా ఉన్నది. ఆయనను మనము వ్యక్తిగతముగా ఎరుగులాగును, మరియు ఆయనను గూర్చి కొన్ని విషయములు మనము తెలుసుకొనులాగును ఆయన తనను తాను బయలుపరచుకున్నాడు. కాని ఒకసారి ఆగి మీరు దీనిని గూర్చి ఆలోచన చేసినట్లయితే, దేవుడు నిజముగా అమితమైనవాడైనట్లయితే, నాకున్న చిన్న మెదడు, లేక చరిత్రలో ఇప్పటి వరకు ఉనికిలో ఉన్న ఉత్తమమైన వేదాంతవేత్తల యొక్క మెదడులు, ఆయనను సంపూర్ణంగా అర్థము చేసుకొనలేవు. నిర్వచనము ప్రకారం, ఆయనను నేను పూర్తిగా అర్థము చేసుకోగలిగితే, నేను ఆయనయంత గొప్పవాడిని అవుతాను. మరియు ఇది మన జీవితములో అతి ప్రాముఖ్యమైన విషయము... మన దేవుడు చిన్న వాడు కాదు. నా మనస్సులోనికి లేక నా పుస్తకములోనికి సంపూర్ణంగా కుదించగల చిన్నవాడు ఆయన కాడు. ఆయన తనను గూర్చి తాను తగినంతగా బయలుపరచుకున్నందుకు, ఆయనను గూర్చి కొంత వరకు అవగాహన కలిగియుండుటకు, ఆయనతో సహవాసము కలిగియుండుటకు, ఆయనతో

**సహవాసములో సరిగా జీవించుటకు, మరియు ఆయనను గూర్చి సంపూర్ణంగా కాకపోయినా సరిగా ఆలోచన చేయుటకు ఆయన మనకు రక్షణను అనుగ్రహించినందుకు మనము వందనస్తులమైయున్నాము.**

— డా. గెరెత్ కోకెరిల్

దైవిక మర్మములు అసంఖ్యాకమైనవని గుర్తించుటతో పాటుగా, దైవిక మర్మముల యొక్క రెండవ ప్రాముఖ్యమైన కోణమును కూడా మనము గుర్తించాలి. మనము దేవుని గూర్చిన వేదాంతశాస్త్రమును అధ్యయనం చేయుచుండగా దైవిక మర్మములు మన అవగాహనను బహుగా పరిమితము చేస్తాయి.

దేవుని గూర్చి మనము కలిగియున్న జ్ఞానమును దైవిక మర్మములు అనేక విధములుగా పరిమితము చేస్తాయి, కాని ఈ పాఠం కొరకు, మనము కేవలం రెంటిని మాత్రమే చూద్దాము. ఒక వైపున, దేవుని గూర్చిన జ్ఞానమును మనము బహుగా పరిమితము చేశాము. క్రీస్తులో రక్షణ మరియు జీవితము కొరకు ప్రాముఖ్యమైన విషయమును దేవుడు స్పష్టము చేసినప్పటికీ, వాస్తవానికి, దేవుని గూర్చి మనలో ఎవరు కూడా ఎక్కువగా అర్థము చేసుకోలేరు. ఒక "అద్దము"లో చూస్తున్నట్లు మనము దేవుని సత్యము యొక్క "అసంపూర్ణమైన ప్రతిబింబము"ను మాత్రమే చూస్తామని మొదటి కొరింథీ. 13:12 తెలియజేస్తుంది.

కాబట్టి, దేవుని సిద్ధాంతమును గూర్చిన చర్చలలో, పూర్తిగా జవాబు ఇవ్వలేని అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఉదాహరణకు, దేవుడు చెడుకు ఎందుకు అనుమతి ఇస్తాడు? ప్రస్తుత సన్నివేశములలో దేవుని ఉద్దేశములను మనము ఎలా వివేచించగలము? అనేక మంది వేదాంతవేత్తలు, ముఖ్యముగా సంశయవాదులతో చుట్టుముట్టబడియున్నవారు, ఇలాంటి ప్రశ్నలకు మా దగ్గర ఎలాంటి జవాబులు లేవని ఒప్పుకొనలేరు కాబట్టి ఊహాగానములను చేస్తారు. కాని దైవిక మర్మములు తరచుగా క్రీస్తు యొక్క నమ్మకముగల అనుచరులు "నాకు తెలియదు" అని ఒప్పుకొనునట్లు చేస్తాయి. దేవుని సిద్ధాంతము విషయంలో, దేవుడు ఒక విషయమును బయలుపరచని యెడల, దానిని మనము ఎరుగలేము. ఇది సత్యము.

క్రీస్తు యొక్క నమ్మకమైన అనుచరులుగా, దేవుని గూర్చి మన యొద్ద మితమైన సమాచారము ఉన్నదనే సత్యము నుండి మనము దూరము కాకూడదు. వాస్తవానికి, ఈ బలహీనతను గూర్చి మాటి మాటికి జ్ఞాపకము చేసుకొనుట ఒక ఆశీర్వాదము. దైవిక మర్మములు దేవుని నమ్మునట్లు మనలను ప్రోత్సహిస్తాయి. దేవుని గూర్చిన జ్ఞానమును పొందుకొనుటకు మన మితమైన సామర్థ్యముల మీద నమ్మకముంచుటకు బదులుగా, పరిశుద్ధాత్మ పరిచర్య ద్వారా మనము తండ్రి మీదను క్రీస్తు మీదను ఆధారపడాలి.

మరొక ప్రక్క, మానవులు దేవుని ప్రత్యక్షతలను గూర్చి కేవలం మితమైన వివరణలను మాత్రమే ఇవ్వగలరని దైవిక మర్మములు అర్థమునిస్తాయి. సత్య దేవుని యొక్క ప్రత్యక్షత స్వయం-ఖండితముగా ఉండదని మనము సరిగానే చెప్పవచ్చు. మరియు దేవుని ప్రత్యక్షతల మధ్య మనము అనేక తార్కిక అనుబంధములను చూడవచ్చు. అయితే మనము దీనిని ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, దైవిక

మర్మములు దేవుని గూర్చి మనము కలిగియున్న సమాచారమును మాత్రమే పరిమితము చేయవు. కాని దేవుడు తనను గూర్చి తాను బయలుపరచుకున్న విషయముల మధ్య తార్కికమైన సంబంధమును వివరించు సామర్థ్యమును కూడా పరిమితము చేస్తాయి.

ఉదాహరణకు, త్రిత్వమును గూర్చి — అనగా దేవుడు ముగ్గురిలో ఒకనిగా ఉన్నాడను సత్యము — మనము స్పష్టమైన తార్కికమైన వివరణను ఇవ్వలేము. యేసు సంపూర్ణముగా మానవునిగాను సంపూర్ణంగా దేవునిగాను ఉన్నాడను సత్యములోని ప్రతి కోణమును మనము తార్కికముగా వివరించలేము. మానవుల విషయముల మీద సంపూర్ణ సార్వభౌమత్వము కలిగియుండి కూడా మనము చేయు పనులకు మనలను బాధ్యులుగా దేవుడు ఎందుకు చేస్తాడో మనము పూర్తిగా స్పష్టపరచలేము. ఉత్తమమైన క్రైస్తవ పండితులు ఇలాంటి ప్రశ్నలకు జవాబులిచ్చుటకు ప్రయత్నించారు. కాని, సంపూర్ణమైన మరియు తార్కికమైన వివరణలను వారు అందించలేకపోయారు.

తుదకు, దేవుడు తనను గూర్చి తాను బయలుపరచుకున్న విషయముల యొక్క తార్కిక అనుబంధమును వివరించుటకు ప్రయత్నించుట విలువైన పనియే. కాని ఒక దానిని సత్యము లేక అసత్యము అని దీని ద్వారా నిర్ధారించలేము. ఏ వేదాంత ప్రతిపాదన యొక్క సత్యమైనా, దేవుడు దానిని సాధారణ లేక విశేష ప్రత్యక్షతలో బయలుపరచాడా లేదా అను విషయము మీద ఆధారపడియుంటుంది.

> **దేవుడు అగోచరమైనవాడని వేదాంతవేత్తలు చెప్పునప్పుడు, వారి అర్థము లేక వారు చెప్పదలచుకున్నది ఏమనగా ఆయన పూర్ణ మూర్తిమత్వమును మరియు వ్యక్తిత్వమును మితమైన మనము జీర్ణించుకొనుట మరియు అర్థము చేసుకొనుట సాధ్యము కాదు. అమితమైనవానిగా దేవుడు ఉన్నాడు కాబట్టి, ఆయనను సంపూర్ణముగా తెలుసుకొనుట మరియు అర్థము చేసుకొనుట అసాధ్యము. ఈ సందర్భములో, రోమా పత్రిక 11:33-34లో, ఆయన బుద్ధి జ్ఞానముల బాహుళ్యము శోధింపనశక్యములు అని పౌలు చెప్పిన మాటలను నేను జ్ఞాపకం చేసుకుంటాను. అయినను, ఆయన అందించిన స్వయం-ప్రత్యక్షత మనము విశ్వసించుటకు సరిపోతుంది.**
>
> — రెవ. ల్యారి కాక్రెల్

దైవిక మర్మముల యొక్క ప్రాముఖ్యతను అర్థము చేసుకొనుటకు, మనము మూల భావనను చూశాము. ఇప్పుడు, దేవుని సిద్ధాంతమును మనము అధ్యయనము చేయుచుండగా ఉపయోగపడు దైవిక మర్మముల యొక్క రకములను పరిగణించుట సహాయకరంగా ఉంటుంది.

### రకములు

మనము రెండు వేర్వేరు రకముల మర్మముల మధ్య వ్యత్యాసము చూపవచ్చు. మొదటి రకమును మనము "తాత్కాలిక మర్మములు" అంటాము. దీని అర్థము ఏమిటో చూద్దాము.

తాత్కాలిక. తాత్కాలిక మర్మములు మానవుల నుండి కొంత కాలము వరకు మరుగుచేయబడి, చరిత్రలో తరువాత కాలములో బయలుపరచబడిన దేవుని గూర్చిన సత్యములు. ఒకప్పుడు నిగూఢముగా ఉన్న విషయములను దేవుడు సాధారణ ప్రత్యక్షత ద్వారా బయలుపరుస్తాడు. ఆయన భౌతిక లోకమును, మానవ సంస్కృతులను, ఇతర ప్రజలను, లేక మనలో కలుగు మార్పులను కూడా తాత్కాలిక మర్మములను బయలుపరచుటకు ఉపయోగిస్తాడు.

విశేష ప్రత్యక్షత విషయములో కూడా ఇలాంటిదే నిజమైయున్నది. దేవుడు ఇచ్చిన తదుపరి విశేష ప్రత్యక్షతలు దేవుని యొక్క మునుపటి విశేష ప్రత్యక్షతలను ఎన్నడును ఖండించలేదని లేఖనములను జాగ్రత్తగా అధ్యయనం చేయుట ద్వారా చూడగలము. అయితే కాల క్రమములో దేవుడు తనను గూర్చి తాను మరి ఎక్కువగా బయలుపరచుకున్నాడు అన్న విషయము కూడా స్పష్టముగా ఉన్నది. విశేష ప్రత్యక్షత యొక్క ఈ విశదీకరణ బైబిలు చరిత్ర యొక్క ప్రతి యుగములోను జరిగింది. అవును, దైవిక మర్మముల యొక్క అత్యంత నాటకీయమైన విశదీకరణ క్రీస్తు యొక్క విశేష ప్రత్యక్షతలో జరిగింది. ఎఫెసీ. 1:9, 3:3, మరియు 6:19 వ్రాసినప్పుడు పౌలు మనస్సులో ఈ విషయము ఉన్నది. ఈ వచనములలో, పౌలు క్రీస్తులో దేవుని మర్మము యొక్క నిత్య ఉద్దేశమును సూచించాడు. క్రొత్త నిబంధన అపొస్తలులు మరియు ప్రవక్తల కాలము వరకు ఈ మర్మము మరుగుచేయబడినదని అతడు వివరించాడు.

ఈ కారణము చేత, మనము దేవుని గూర్చి నేర్చుకొనుటకు ప్రయత్నించిన ప్రతి సారి, పాత నిబంధనలో కనిపించు తాత్కాలిక మర్మములను గూర్చి స్పష్టత పొందుటకు క్రొత్త నిబంధనలోని విశేష ప్రత్యక్షతను మనము వెదకాలి.

> దేవుని గూర్చి మాట్లాడునప్పుడు కొన్నిసార్లు మనము “నిగూఢమైన” అనే పదమును ఉపయోగిస్తాము ఎందుకంటే ఆయన ఏమి చేస్తున్నాడో ఖచ్చితముగా మనము అర్థము చేసుకోలేము. మరొక వైపు, క్రొత్త నిబంధన *మిస్టీరియోస్* — ఇంచుమించు ఇది అదే పదము — అనే పదము నుండి వెలువడిన “నిగూఢమైన” అనే పదమును ఉపయోగిస్తుంది, మరియు దీని అర్థము ఏమిటంటే దేవుని యొక్క కృప గల రక్షణ ప్రణాళికను మన సొంతగా మనము ఎన్నడును కనుగొనియుండేవారము కాము. అనగా, దేవుడు బయలుపరచియుండకపోతే దీనిని మనము ఎన్నడును అర్థము చేసుకొనియుండేవారము కాము కాబట్టి ఇది మర్మమైయున్నది. మరియు అలాగే, విశేష ప్రత్యక్షతలో దేవుడు తన ప్రణాళికను మనకు బయలుపరుస్తాడు. *మిస్టీరియోస్* అనే పదము ఈ కారణము చేతనే ఎఫెసీ పత్రికలోను మరియు 1 కొరింథీ పత్రికలోను ఉపయోగించబడింది. దేవుడు నిదానముగా ... ఆయన యొక్క ప్రత్యక్షతను విశదపరచి యూదునికి మరియు అన్యజనునికి రక్షణ ఎలా వర్తిస్తుందో, మరియు యేసు క్రీస్తును మెస్సీయగా అంగీకరించినవారికి ఎలా చెందుతుందో చూపుతున్నాడు.
>
> — డా. శామ్యూల్ లేమర్సన్

అలాగే క్రొత్త నిబంధన క్రైస్తవులుగా కూడా, దేవుడు మనకు ప్రతి తాత్కాలిక మర్మమును బయలుపరచలేదని మనము జ్ఞాపకముంచుకోవాలి. 1 కొరింథీ 13:12లో, పౌలు ఇలా వ్రాస్తున్నాడు:

> ఇప్పుడు కొంతమట్టుకే యెరిగియున్నాను; అప్పుడు నేను పూర్తిగా ఎరుగబడిన ప్రకారము పూర్తిగా ఎరుగుదును (1 కొరింథీ 13:12).

క్రీస్తు మహిమలో తిరిగి వచ్చిన తరువాత మాత్రమే ఆయన ప్రతి తాత్కాలిక మర్మమును బయలుపరుస్తాడు. మరియు మనము నేటి కంటే మరిఎక్కువ సంపూర్ణంగా దేవుని మరియు ఆయన మార్గములను అర్థము చేసుకోగలము.

మనము చూచినట్లుగా, దేవుని సిద్ధాంతమును మనము అధ్యయనము చేసినప్పుడు మనము అనేక తాత్కాలిక మర్మములను ఎదుర్కొంటాము. కాని దేవుని గూర్చిన వేదాంతశాస్త్రమును అధ్యయనం చేయుచుండగా మనము శాశ్వత మర్మములను కూడా ఎదుర్కొనవలసియున్నదని బైబిలు స్పష్టము చేస్తుంది.

శాశ్వత. శాశ్వత మర్మములనగా మానవులు ఎన్నడును అర్థము చేసుకోలేని దేవుని గూర్చిన సత్యములు, ఎందుకంటే అవి మన ఆలోచనకు మించినవైయున్నవి. సాంప్రదాయిక వేదాంతశాస్త్రములో, ఈ సత్యమును దేవుని యొక్క అగోచరత్వము అని పిలుస్తారు. దేవుడు ఆయనను గూర్చిన విషయములను మానవుల ఆలోచన ప్రకారం బయలుపరచుచుండగా మనము ఆయనను గూర్చి కొన్ని విషయములను అర్థము చేసుకోగలము, కాని మనము దేవునిని గూర్చి సమస్తమును ఎన్నడు అర్థము చేసుకోలేము. ఈ ఆలోచనను మనము యెషయా 55:8-9లో చూస్తాము, అక్కడ ప్రవక్తయైన యెషయా ఇలా వ్రాశాడు:

> నా తలంపులు మీ తలంపులవంటిని కావు మీ త్రోవలు నా త్రోవలవంటిని కావు ఇదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికిపైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గములకంటె నా మార్గములు మీ తలంపులకంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి (యెషయా 55:8-9).

ఈ వచనములలో, దేవుని యొక్క అగోచరత్వము కారణంగా దేవుని యొక్క శాశ్వత మర్మములను యెషయా ఇశ్రాయేలుకు జ్ఞాపకం చేశాడు.

> లేఖనములు దేవుని నిగూఢమైనవనిగా సంబోధించినప్పుడు, "నిగూఢ" అనే పదమును అపార్థం చేసుకోకుండా మనము జాగ్రత్తపడాలి. ఈ లోకములో ఉన్న విషయములు నిగూఢమైనవని నేను ఆలోచించునప్పుడు, వాటిలో కొన్ని చీకటి రహస్యములు ఉన్నాయని అవి నన్ను ఏదో ఒక రోజు ఆశ్చర్యపరుస్తాయని నా ఆలోచన. కాని ఇక్కడ అర్థము అది కాదు. ఇక్కడ "నిగూఢమైన" అంటే దేవుడు అగోచరమైనవాడని మన అర్థము. మన ఊహకు మించిన జీవనము ఆయనకు ఉన్నదని మన అర్థము. అనగా ఆయనను గూర్చి మనము సంపూర్ణంగా అర్థము

చేసుకోలేనిది ఏదో ఒకటి ఉన్నది. మరియు ఇది నాకు ఇష్టం. అనగా ఆయన మన సృష్టమైన జీవితమునకు మించినవానిగా ఉన్నాడు. ఆయన నా ఆలోచనకు మించినవాడు. దీని కొరకు మేము ఉపయోగించు వేదాంత పదము “స్వయం శ్రేష్టత.” దేవుడు స్వయం శ్రేష్టత గలవాడు. ఆయన మన ఆలోచనా పరిధికి మించినవాడు. మరియు అందుకే ఆయన ఆరాధనకు యోగ్యుడు. అందుకే ఆయన గొప్పవాడు. అందుకే ఆయన మనము ఇష్టపడువాడు.

— డా. గ్యారీ ఎం. బర్గ్

దేవునిలో మర్మము అనేది ఆయన స్వభావము వలన, ఆయన అమితత్వము మరియు మన మితత్వము, మన పరిమితి మరియు ఆయన అపరిమితమైన శక్తి మరియు అవగాహన వలన కొంత వరకు కలుగుతుంది. అంతేగాక, అది సృష్టిలో ఆయన ఉద్దేశములు మరియు ప్రణాళికలతో కూడా ప్రత్యేకమైన సంబంధం కలిగియున్నది. దేవుడు ఈ విధముగా ఎందుకు పని చేస్తాడు మరియు ఆ విధంగా ఎందుకు చెయ్యడు? మరియు చాలా సార్లు, అహంకారముగల మానవులుగా, దేవుని కంటే పనులు చేయుట మనకు బాగా తెలుసు అని మనము ఆలోచిస్తామని నేననుకుంటాను. అయితే దేవుని మర్మములో... లేఖనము దీనిని గూర్చి మాట్లాడుతుంది, ఉదాహరణకు, ద్వితీ. 29:29 ప్రకారం, మరుగుచేయబడిన విషయములు దేవునికి మాత్రమే చెందినవి, కాని బయలుపరచబడినవి మన కొరకు, అవి మనము ఆనందించుట కొరకు మరియు వేడుక చేసుకొనుట కొరకు ఇవ్వబడినవి, మరియు దేవుడు మనకు సమస్తమును తెలియజేయలేదు అనుటకు కూడా ఒక భావము ఉంది, తనను గూర్చి తాను సమస్తమును తెలియజేయలేదు — ఆయన ఎలా తెలియజేయగలడు? మరియు మనము ఎలా అర్థము చేసుకోగలము? అంతేగాక, ఆయన తన ప్రణాళికలను మరియు ఉద్దేశములను ఎలా నెరవేర్చుతున్నాడో మనకు ఏమియు తెలియపరచలేదు. మరియు దేవుడు ఈ విషయములను ఎందుకు అనుమతించాడు అని తాను అడిగిన ప్రశ్నలకు జవాబుల కొరకు ఎదురుచూసిన పాత నిబంధనలోని యోబు కంటే దీనిని గూర్చి మరి ఎక్కువగా ఎవరికీ తెలియదు, మరియు తాను కోరిన జవాబును దేవుడు అతనికి ఇవ్వలేదు. దేవుడు ఇచ్చిన జవాబు ఏమనగా, “నేను ఏమి చేయుచున్నానో నాకు తెలుసు, మరియు ఒక విధంగా నా ప్రణాళికలో ఒక మర్మము ఉన్నది మరియు దానిని నేను మాత్రమే పూర్తిగా వివరించగలను, మరియు తుదకు కాలము సమాప్తమైన తరువాత అనుకోకుండా ఒక్కసారిగా సమస్తము నీకు అర్థమవుతుంది.”

— రెవ. డా. లెవీస్ వింక్లర్

దేవుని గూర్చి మనము ఏమి ఎరిగియున్నాము అనే మన ఈ పాఠ్యక్రమమును ఆరంభించుచుండగా, మనము ఈ విషయమును ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకోవాలి, దేవుడు తనను తాను సాధారణ మరియు విశేష ప్రత్యక్షతలో బయలుపరచుకున్నప్పటికీ, ఆయన తాత్కాలిక మరియు శాశ్వత మర్మములను మన నుండి మరుగుచేసియుంచాడు. మనము దేవుని గూర్చిన అవగాహనలో ఎంతో పరిమితము కలిగియున్న నిమిత్త మాత్ర సృష్టములమనే సత్యము నుండి తప్పించుకోలేము.

దేవుని గూర్చి మనకు ఏమి తెలుసు అనే ఈ పాఠంలో ఇంతవరకు దైవిక ప్రత్యక్షత మరియు మర్మములు దేవుని గూర్చిన వేదాంతశాస్త్రమును ఎలా ప్రభావితము చేస్తాయో చూశాము. కాబట్టి, ఇప్పుడు మన రెండవ ముఖ్య అంశమును పరిచయం చేయుటకు సిద్ధంగా ఉన్నాము: దేవుని గుణములు మరియు కార్యములు. దేవుని గూర్చి మనము ఏమి తెలుసుకోగలము అనే విషయమును గూర్చి సాంప్రదాయిక వేదాంతవేత్తలు క్రోడీకరించిన రెండు ముఖ్యమైన మార్గములకు ఈ అంశములు ప్రాతినిధ్యం వహిస్తాయి.

# గుణములు & కార్యములు

దేవుని యొక్క గుణములు మరియు కార్యములతో పాటుగా, క్రమబద్ధ వేదాంతవేత్తలు దేవుని గూర్చిన వేదాంతశాస్త్రములో త్రిత్వ సిద్ధాంతము పట్ల ఎక్కువ ఆసక్తిని చూపారు. అపొస్తలుల విశ్వాస ప్రమాణము మీద మన పాఠ్యక్రమములో పరిశుద్ధ త్రిత్వమును గూర్చి విస్తారముగా మనము చూద్దాము. కాబట్టి, ఈ పాఠ్యక్రమములో మిగిలిన రెండు ముఖ్యమైన అంశముల మీద మన దృష్టినిపెడదాము.

తదుపరి పాఠములలో, దేవుని గుణములు మరియు కార్యములను గూర్చిన అనేక విషయములను మనము చూద్దాము, కాని ఇక్కడ ప్రతి అంశమును పరిచయం మాత్రమే చేద్దాము. మొదటిగా, దైవిక గుణములు, లేక దేవుడు ఎవరు అనే విషయమును పరిగణిద్దాము. మరియు రెండవదిగా, మనము దైవిక కార్యములను, లేక దేవుడు ఏమి చేస్తాడో చూద్దాము. దేవుని యొక్క దైవిక గుణములతో ఆరంభించుదాము.

## దైవిక గుణములు

దైవిక గుణములు అనే అంశమును రెండు మెట్లలో పరిచయం చేయుట సహాయకరంగా ఉంటుంది. దైవిక గుణముల యొక్క మూల భావనతో ఆరంభిద్దాము. తరువాత క్రమబద్ధ వేదాంతశాస్త్రములో విపులపరచబడిన దైవిక గుణముల యొక్క రకములను పరిశీలన చేద్దాము. కాబట్టి, దైవిక గుణముల యొక్క మూల భావన ఏమిటి?

### మూల భావన

"దేవుని గుణములు ఏమిటి?" అని మనము అనేక మంది క్రైస్తవులను అడిగితే, దేవుని గుణములు అనగా లేఖనములు దేవునికి ఆపాదించు గుణములు లేక లక్షణములు అని వారు చెప్పవచ్చు. సరే, ఈ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆలోచన చాలా వరకు సరియైనదే. కాని, సాంప్రదాయిక క్రమబద్ధ వేదాంతశాస్త్రములో "దేవుని గుణములు" అనే మాట మరింత విశేషమైన ఒక దానిని సూచిస్తుంది.

క్రమబద్ధ వేదాంతశాస్త్రములో, దైవిక గుణములు అనగా:

> పలు రకముల చారిత్రిక వ్యక్తీకరణములలో బయలుపరచబడిన దేవుని సారము యొక్క పరిపూర్ణతలు.

ఈ నిర్వచనము దేవుని గుణముల యొక్క అధికారిక చర్చలను రూపుదిద్దు రెండు ప్రాథమిక కారకాలను ఎత్తి చూపుతుంది. మొదటి స్థానములో, దేవుని గుణములు "దేవుని సారమునకు పరిపూర్ణతలు"గా ఉన్నాయి. ఆధునిక ఇవాంజెలికల్ క్రైస్తవులు దేవుని సారమును గూర్చి తరచుగా మాట్లాడరు. కాబట్టి, ఈ అంశమును గూర్చి మరింత చర్చించుట సహాయకరముగా ఉంటుంది.

ఆరంభించుటకు, "సారము" అనే పదము ల్యాటిన్ పదమైన *ఎస్సెన్షియ* నుండి వెలువడింది, మరియు దీని అర్థము "సారము" లేక "వ్యక్తిత్వము." ల్యాటిన్ వేదాంతశాస్త్రములో, దేవుని సారము *సబ్స్టెన్షియ* లేక "పదార్థము" అనే పదముతో దగ్గర సంబంధం కలిగియున్నది. పితరుల కాలములోని మరియు మధ్యకాలములోని వేదాంతవేత్తలు ఈ పదములను నియో-ప్లాటోవాదము మరియు అరిస్టొటిల్ తర్కము నుండి సేకరించారు. ఇప్పుడు, ప్లాటో మరియు అరిస్టొటిల్ సారము అనే ఆలోచనను పలు విధాలుగా పరిగణించారు. మరియు ఆధునిక తర్కవాదములో కూడా సారము అనే అంశమునకు అనేక ప్రాముఖ్యమైన క్లిష్టతలు ఉన్నాయి. అయితే ముఖ్య ఆలోచనను గ్రహించుట అంత కష్టమైన పని కాదు.

సులువైన మాటలలో, ఒక వస్తువు యొక్క "సారము," "వ్యక్తిత్వము," లేక "పదార్థము" దాని యొక్క బాహ్యమైన, మారుచున్న వ్యక్తీకరణములను తెలియపరచు మారని సత్యముగా ఉన్నది. దేవుని యొక్క గుణములు లేక పూర్ణతలను గూర్చి చర్చించునప్పుడు క్రైస్తవ వేదాంతవేత్తలు సారము అనే ఈ ఆలోచన మీద ఆధారపడ్డారు.

సాధారణంగా, దేవుని సారములో నాలుగు ముఖ్యమైన విశేషతలు ఉన్నాయి: దేవుడు తానలో తాను ఏమైయున్నాడో, అది దేవుని సారము; దేవుని పరిపూర్ణతలు లేక గుణములు, దేవుని సారము యొక్క లక్షణములు; దేవుని దీర్ఘకాల చారిత్రిక వ్యక్తీకరణలు, ఎక్కువ కాలము పాటు ఆయన యొక్క స్వయం బయల్పాటులు; మరియు దేవుని యొక్క కొద్ది కాల చారిత్రిక వ్యక్తీకరణలు, తక్కువ కాలము పాటు ఆయన యొక్క స్వయం బయల్పాటులు.

ఇక్కడ మన అర్థమును స్పష్టము చేయుటకు, ఈ విశేషతలను గూర్చి ఒక వ్యక్తి యొక్క ఉదాహరణను తీసుకొని ఆలోచన చేద్దాము. ఈ వ్యక్తి సంఘములో లేక ఆదివారపు ఆరాధనలలో సోలో పాడువాడు అని మనము చెప్పవచ్చు. అతడు తన దొడ్డిలో రోజుకు రెండుసార్లు ఆవుల పాలు పితికే వ్యవసాయకుడు. అతడు ఒక భర్త మరియు తాత కూడా. మరియు అవును, క్రైస్తవులుగా, అతడు దేవుని స్వరూపమైయున్నాడని, దేవుని రాయబారిగాను మరియు దేవుని సేవకునిగాను అభిషేకించబడినాడని మనకు తెలుసు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ వ్యక్తిని గూర్చి మనము ఎరిగియున్న కొన్ని సత్యములు కొద్ది కాల చారిత్రిక వ్యక్తీకరణలైయున్నాయి. ఈ వ్యక్తిని గూర్చి ఈ విషయములు కొన్ని సందర్భాలలో మాత్రమే సత్యమైయున్నాయి. అతడు సంఘములో సోలో పాడతాడు, కాని ఆదివారములు మాత్రమే. అతడు ఆవుల పాలు పితుకుతాడు, కాని కేవలం రోజుకు రెండు సార్లు మాత్రమే. అతనిని గూర్చి ఈ వర్ణనలు సత్యమైనప్పటికీ, అవి అతని యొక్క సారమును సంబోధించవు. బదులుగా, అతడు ఈ పనులు చేసినా చేయకపోయినా ఒకే వ్యక్తిగా ఉంటాడు.

ఈ వ్యక్తిని గూర్చిన మరికొన్ని వర్ణనలు ఎక్కువ కాల చారిత్రిక వ్యక్తీకరణలైయున్నాయి. అతడు ఒక భర్త మరియు తాత. ఈ వర్ణనలు ఎక్కువ కాలము వరకు వర్తిస్తాయి, కాని ఇవి కూడా ఈ వ్యక్తి యొక్క సారములో ముఖ్యమైనవి కావు. అతడు ఎల్లప్పుడూ భర్త లేక తాతయై యుండిలేడు. కాని అతడు ఎల్లప్పుడు అదే వ్యక్తిగా ఉన్నాడు.

ఈ వ్యక్తిని గూర్చి మనము దేవుని స్వరూపముగా, దేవుని రాయబారి మరియు దేవుని సేవకునిగా అభిషేకించబడినవానిగా మాటలాడునప్పుడు, మనము అతని సారము యొక్క శాశ్వత గుణములను, మానవుల లక్షణములను గూర్చి మాట్లడుచున్నాము. అతని జీవితములో ఏమి జరిగినను, ఈ వర్ణనలు అతని జీవితములో వాస్తవమైయున్నాయి.

కాని అతనిని గూర్చి మనకు తెలిసిన ప్రతి దానిని మనము జతపరచవలసివస్తే, అతని శాశ్వత గుణములు కూడా, అతని సారమును గూర్చి మనము కేవలం కొన్ని విషయములను మాత్రమే చూడగలుగుతున్నామని గుర్తిస్తాము. ఈ మనిషి యొక్క సారము ఏమిటి అనే విషయం ఎల్లప్పుడు మనకు దొరకకుండానే ఉంటుంది, మరియు అది ఎల్లప్పుడు మన సంపూర్ణ అవగాహనకు అందకుండానే ఉంటుంది.

అనేక విధాలుగా, దేవుని గూర్చిన వేదాంతశాస్త్రములో క్రమబద్ధ వేదాంతవేత్తలు ఇలాంటి విశేషతలనే చూపుతారు. ఇప్పుడు, లేఖనములు దేవుని యొక్క ప్రతిమలను చేయుటను నిషేదిస్తాయని మనకు తెలుసు. కాబట్టి, ఇక్కడ మనము దేవుని చిత్రించుటకు ప్రయత్నించము. అయితే దేవుని సారమును గూర్చి అవగాహనను పొందుటకు మనము ఒక సాదృశ్యమును ఉపయోగించుదాము. బయట అంతరిక్షములో ఉన్న ఒక నిగూఢమైన సన్నని మబ్బు దేవుని సూచిస్తుంది అని అనుకోండి. ఈ సన్నని మబ్బు చుట్టూ దేవుని సారము యొక్క గుణములను లేక పరిపూర్ణతలను సూచించు మరకలు గల గాజు కిటికీలు ఉన్నాయి. దీనికి దూరముగా, దేవుని యొక్క ఎక్కువ-కాల వ్యక్తీకరణలను సూచించు నక్షతముల మరియు గ్రహముల వ్యవస్థ ఉన్నదని ఊహించుకోండి. మరియు చివరిగా, దేవుని యొక్క కొద్ది-కాల వ్యక్తీకరణలను సూచించు నక్షత్రములు మరియు గ్రహములు మరికొంత దూరములో ఉన్నాయని ఊహించుకోండి. చరిత్రలో దేవుని సారము, ఆయన గుణములు, ఆయన ఎక్కువ-కాల మరియు కొద్ది-కాల వ్యక్తీకరణల మధ్య ఉన్న వ్యత్యాసములు సాంప్రదాయిక క్రమబద్ధ వేదాంతశాస్త్రములో దేవుని సిద్ధాంతమును గూర్చిన చర్చలకు ప్రాముఖ్యమైనవిగా ఉన్నాయి.

1530లో వ్రాయబడి ఆంగ్లికన్ *థర్టి-నైన్ ఆర్టికల్స్ ఆఫ్ రిలీజియన్ మరియు మెథడిస్ట్ ట్వంటీ-ఫైవ్ ఆర్టికల్స్ ఆఫ్ రిలీజియన్* లోని దేవుని సారమును గూర్చిన చర్చలను పోలియున్న లూథరన్ *ఆగ్స్బర్గ్ కన్ఫెషన్* యొక్క మొదటి వ్యాసమును వినండి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పిలువబడిన మరియు దేవుడైయున్న దైవిక సారము ఒకటి కలదు: నిత్యమైన, శరీరము లేని, భాగములు లేని, అమితమైన శక్తి, జ్ఞానము మరియు మంచితనముగల, దృశ్య అదృశ్యమైన విషయములన్నిటి యొక్క సృష్టికర్త మరియు పోషకుడు.

ఇక్కడ మనము చూచునట్లుగా, కన్ఫెషన్ "ఒకే దైవిక సారము"ను గూర్చి విశేషంగా మాట్లాడుతుంది. దీని వలన, దేవుని సారము మార్పులేని సత్యముగా ఉన్నది మరియు చరిత్రలో దేవుడు తనను తాను బయలుపరచుకున్న అనేక మార్గములను ఇది సూచిస్తుంది.

దురదృష్టవశాత్తు, సంస్కరణకు ముందు, క్రైస్తవ మార్మికవాదమును హత్తుకొనిన కొంతమంది వేదాంతవేత్తలు గ్రీకు తత్వవాదములను అనుసరించి దేవుని సారము నిగూఢమైనదని తేల్చారు. ఈ అభిప్రాయం ప్రకారం, దేవుని ప్రత్యక్షతలు ఆయన నిత్య సారమును గూర్చి చాలా తక్కువ బయలుపరుస్తాయి. అవి ఆయన మాధ్యమిక, మారుచున్న చారిత్రిక వ్యక్తీకరణలను గూర్చి మాత్రమే తెలియపరుస్తాయి. ఇప్పుడు, మనము గ్రహించగలిగిన దాని కంటే ఎంతో అమితమైన విషయములు దేవుని సారములో ఉన్నాయని ఇవాంజెలికల్ క్రైస్తవులు ఒప్పుకుంటారు. కాని, దీని తరువాత కూడా, దేవుడు ఆయన దైవిక సారము యొక్క గుణములను లేక లక్షణములను నిజముగా బయలుపరచాడని ఇవాంజెలికల్ క్రైస్తవులు నమ్ముతారు. ఈ నమ్మకము లేఖన బోధలను స్పష్టముగా అనుసరిస్తుంది.

*ఆగ్స్బర్గ్ కన్ఫెషన్* యొక్క మొదటి వ్యాసమును మరొకసారి చూడండి. "ఒకే దైవిక సారము"ను గూర్చి ప్రస్తావించిన వెంటనే, కన్ఫెషన్ దేవుని సారము యొక్క అనేక లక్షణములను లేక విశేషతలను గూర్చి మాట్లాడుతుంది. దేవుడు "నిత్యమైన, శరీరము లేని, భాగములు లేని, అమితమైన శక్తి, జ్ఞానము మరియు మంచితనముగలవాడు." దేవుని గుణములు — ఈ నిత్యమైన, మారని లక్షణములు — దేవుని సారమును సూచిస్తాయి.

కొన్ని సార్లు, లేఖన రచయితలు కూడా విశేషంగా దేవుని యొక్క నిత్యమైన, ప్రాముఖ్యమైన పరిపూర్ణతలను సూచించారు. ఉదాహరణకు, "యెహోవా ఉత్తముడని" కీర్తనలు 34:8 ప్రకటిస్తుంది. దేవుడు "నిత్యుడని" 1 తిమోతి 1:17లో పౌలు వ్రాస్తున్నాడు. మనము లేఖనమంతటిని అధ్యయనం చేయునప్పుడు, దేవుడు ఒక పరిస్థితిలో ఏమి చేసినా లేక చెప్పినా, ఆయన ఏ రకమును ఉపయోగించినా, ఆయన ఎల్లప్పుడు ఉత్తముడని మరియు ఆయన ఎల్లప్పుడు నిత్యుడని స్పష్టమవుతుంది. దేవుని అమితత్వము, ఆయన పరిశుద్ధత, ఆయన న్యాయము, ఆయన జ్ఞానము, ఆయన అగోచరత, ఆయన సర్వశక్తి మరియు ఇతర దైవిక గుణములను గూర్చి లేఖనముల బోధను గూర్చి కూడా ఇదే చెప్పవచ్చు. ఇవన్ని లేఖనములు విశేషముగా సంబోధించు దైవిక సారము యొక్క శాశ్వత లక్షణములుగా ఉన్నాయి.

దేవుని గుణము అనేది దేవునికి మాత్రమే స్వాభావికమైనది. అది దేవుని దేవునిగా చేయునది. దీనిని మీరు ఆయన స్వభావము, ఆయన పదార్థము అని పిలువవచ్చు. తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ ఈ వాస్తవములో సంపూర్ణంగా పాలివారైయున్నారు. మరియు, ఇది మితమైన సృష్టములైన మనను అనేక

విధములుగా వ్యత్యాసపరుస్తుంది. మరియు అవును, ఇది దేవుని యొక్క "దైవత్వము"ను నిర్వచిస్తుంది.

— డా. జే. స్కాట్ హోరెల్

అయితే ఇప్పుడు దైవిక గుణములను గూర్చి మనము ఇచ్చిన నిర్వచనమును మరొక సారి చూద్దాము. దేవుని సారము యొక్క పరిపూర్ణతలుగా ఉండుటతో పాటుగా, దైవిక గుణములు అనేక రకముల చారిత్రిక వ్యక్తీకరణల ద్వారా కూడా బయలుపరచబడినవి.

మనము ఇంతకు ముందు చెప్పినట్లుగా, లేఖనములు కొన్ని సార్లు దేవుని యొక్క నిత్య గుణములను సూటిగా సూచిస్తాయి. కాని, ఎక్కువ శాతం, అవి దేవుని యొక్క గుణములను వివరణలు, పేర్లు మరియు బిరుదులు, అలంకారములు మరియు ఉపమానములు, మరియు చరిత్రలో ఆయన కార్యములను గూర్చిన వృత్తాంతముల ద్వారా పరోక్షంగా కూడా చూపుతాయి. ఈ వ్యక్తీకరణలలో ఏది కూడా ఆయన సారమునకు భిన్నముగా లేదు — దేవుడు ఎల్లప్పుడు ఆయన ఉనికికి అనుగుణంగా ఉన్న విధంగానే తనను తాను బయలుపరచుకుంటాడు — కాని, క్రమబద్ధ వేదాంతశాస్త్రములో, దేవుని గుణములు మరియు ఆయన వ్యక్తీరణలు ఒకటి కాదు. బదులుగా, ఇలా అడుగుట ద్వారా మనము దేవుని గుణములను నిర్థారిస్తాము: "దేవుని విషయములో ఎల్లప్పుడు ఏవి సత్యమైనవైయుండాలి, మరియు చరిత్రలో ఆయన తనను తాను బయలుపరచుకొనిన అనేక మార్గములను వివరించుటకు దేవుని గూర్చి ఏది సత్యమైయుండాలి?"

ఇక్కడ మనము కొంచెం జాగ్రత్తగా ఉండాలి. కొంత కాలము వరకు మాత్రమే దేవుని గూర్చి సత్యమైన విషయములతో మనము వ్యవహరించునప్పుడు, దేవుని గుణములు మరియు వ్యక్తీకరణల మధ్య ఈ వ్యత్యాసమును కనుగొనుట సాధారణంగా కష్టమైన పని కాదు. ఉదాహరణకు, యెహె. 8:18లో, ఆయన తన ప్రజల యొక్క ప్రార్థనలను విననని దేవుడు చెప్పాడు. కాని స్పష్టముగా, ప్రార్థనలను వినకపోవుట దేవుని యొక్క సారము అని మాత్రం మనము చెప్పకూడదు. ఇంకా అనేక చోట్ల, దేవుడు మన ప్రార్థనలను వింటాడని లేఖనములు చెబుతున్నాయి. దేవుని గూర్చిన ఈ రెండు వివరణలు కూడా ఆ కాలములలో నిజమైన చారిత్రిక వ్యక్తీకరణలైయున్నాయి. కాని ఆ రెంటిలో ఏవి కూడా ఆయన సారము యొక్క లక్షణములు మాత్రము కాదు. బదులుగా, దేవుని లక్షణములు ఆయన సారము యొక్క నిత్య పరిపూర్ణతలుగా ఉన్నాయి మరియు అవి ఆయన ప్రార్థనలను వినినప్పుడు మరియు విననప్పుడు కూడా వాస్తవమైయున్నాయి.

ఇప్పుడు, దీనికి భిన్నంగా, అవి ఎక్కువ కాలము పాటు ఉనికిలో ఉన్నప్పుడు దేవుని గుణములు మరియు ఆయన చారిత్రిక వ్యక్తీకరణల మధ్య వ్యత్యాసము చూపుట కష్టమవుతుంది. ఉదాహరణకు, తరము వెంబడి తరము దేవుడు పాపుల పట్ల సహనమును చూపాడు కాబట్టి సహనము అనేది దేవుని యొక్క గుణము అని ఆలోచించునట్లు మనము శోధింపబడవచ్చు. కాని, మనము బైబిలు నుండి తెలుసుకొనునట్లు, చరిత్రలో వేర్వేరు సమయాలలో వేర్వేరు ప్రజల మధ్య దేవుని సహనము ముగియబడింది. మరియు మహిమలో క్రీస్తు ఆఖరు తీర్పు ఇచ్చుటకు తిరిగివచ్చినప్పుడు, అది పాపులందరి కొరకు

ముగియబడుతుంది. కాబట్టి, క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క సాంకేతిక భావనలో, ఎక్కువ కాలము ఉండు దేవుని సహనము కూడా దేవుని సారము యొక్క నిత్యమైన గుణము కాదు.

ఈ వ్యత్యాసమును మనము తదుపరి పాఠములలో మరింతగా వివరించుదాము. కాని ఈ సమయములో, ముఖ్య ఆలోచన మాత్రము స్పష్టముగా ఉండాలి. దేవుడు చరిత్రలో కొన్ని మార్గములలో తక్కువ-కాలము మరియు ఎక్కువ-కాలము తనను తాను బయలుపరచుకుంటాడు. అయితే, దేవుని గుణములు మాత్రము ఆయనను గూర్చిన నిత్యమైన వాస్తవములుగా ఉన్నాయి, మరియు అవి నిర నిరంతరము ఉంటాయి.

దైవిక గుణములను మరియు ఈ మూల భావనను దృష్టిలో ఉంచుకొని, మనము రెండవ విషయమును చూడాలి: పలు రకముల దేవుని గుణములు. దేవుని సారము యొక్క పరిపూర్ణతలను వేదాంతవేత్తలు ఎలా కనుగొన్నారు మరియు ఎలా విభజించారు?

## రకములు

బైబిలు దేవుని గుణములన్నిటిని స్పష్టముగా గుర్తించదు కాబట్టి, మరియు అది మన కొరకు వాటిని విభజించదు కాబట్టి, వేదాంతవేత్తలు దేవుని పరిపూర్ణతలను కూడా అనేక విధములుగా విభాగించారు. ఈ పాఠములో మనము ఇంతకు ముందు ప్రస్తావించిన విధములుగా అనేక మంది పండితులు దేవుని గుణములను విభజించారు: "సకారణత్వ మార్గము," "నిరాకరణ మార్గము," మరియు "ఔన్నత్య మార్గము." దేవుని గుణములను విభాగించు మరొక సామాన్యమైన మార్గము దేవుని రూపముగా మానవుల యొక్క వర్తమాన అవగాహనల మీద ఆధారపడియున్నది. ఈ పద్ధతిలో, దేవుని పరిపూర్ణతలను గూర్చి ఆయన "వ్యక్తిత్వము," ఆయన "జ్ఞానము," ఆయన "చిత్తము" మరియు ఆయన "నైతిక స్వభావము"గా మాట్లాడుట చాలా సామాన్యమైన విషయము. ఇప్పుడు, ఈ విభజన వ్యవస్థలలో ఏది కూడా అత్యంత ప్రాముఖ్యమైనది కాదు. కాని వేదాంతవేత్తలు దేవుని గుణములను గూర్చి చర్చించుచుండగా, అవి ప్రత్యక్షంగా లేక పరోక్షంగా మరలా మరలా ప్రత్యక్షమవుతాయి కాబట్టి వాటిని మనము దృష్టిలో ఉంచుకోవాలి.

చాలా వరకు, దేవుని పరిపూర్ణతలను రెండు ముఖ్యమైన గుణముల రకములుగా విభాగించుటను ఇవాంజెలికల్ క్రైస్తవులు ప్రతిపాదిస్తారు. మొదటి రకము దేవుని యొక్క వ్యాప్తిచెందలేని గుణములు. మరియు రెండవ రకమును ఆయన యొక్క వ్యాప్తి చెందగల గుణములు అని సంబోధిస్తారు. వ్యాప్తిచెందలేని గుణములతో ఆరంభించి ఈ రెండు విభజనల యొక్క అర్థము ఏమిటో విపులపరచుదాము.

వ్యాప్తి చెందలేని. ప్రఖ్యాతిగాంచిన వేదాంతవేత్తలు ఈ రెండింతల విభజన యొక్క పరిమితులను తరచుగా ఎత్తిచూపారు, మరియు వీటిలో కొన్నింటిని మనము రానున్న పాఠములలో చూద్దాము. కాని దేవుని సారము యొక్క పరిపూర్ణతను గూర్చి మాట్లాడుటకు ఈ విభజన ఒక సామాన్యమైన మార్గముగా ఉన్నది.

"వ్యాప్తిచెందలేని" అనే మాటకు అర్థము "పంచలేనివి." కాబట్టి, దేవుని యొక్క వ్యాప్తిచెందలేని గుణములు సృష్టి ఆయనతో పంచుకోలేని ఆయన సారము యొక్క పరిపూర్ణతలు — దేవుని రూపములుగా మానవులు అనే విషయముతో సహా. ఈ విధంగా, వ్యాప్తి చెందలేని గుణములు "నిరాకరణ మార్గము" ద్వారా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మనము నిర్ధారించగల దేవుని పరిపూర్ణతలు. దేవుడు ఆయన సృష్టి నుండి ఎలా వేరుగా ఉన్నాడో ఈ గుణములు తెలియజేస్తాయి.

మనము ఇంతకు ముందు చూసినట్లు, *ఆగ్స్బర్గ్ కన్ఫెషన్* యొక్క మొదటి వ్యాసము దేవుని యొక్క ఆరు గుణములను తెలియజేస్తుంది. ఆయన నిత్యమైన, శరీరము లేని, భాగములు లేని, అమితమైన శక్తి, జ్ఞానము మరియు మంచితనముగలవాడు. ఇది అతిగా సులభతరము చేయబడిన విషయము కావచ్చు, కాని దేవుని యొక్క వ్యాప్తిచెందలేని గుణములను నిత్యమైన, శరీరము లేని, భాగములు లేని మరియు అమితమైన అనే పదములతో అనుబంధపరచుట చాలా సామాన్యమైన విషయము. దేవుడు నిత్యుడు; మనము అనిత్యులము. ఆయన శరీరము లేనివాడు; మనము శరీరులము. ఆయన భాగములు లేని వాడు; మనము భాగములుగా విభజించబడ్డాము. ఆయన అమితమైనవాడు; మనము మితమైన వారము.

ఇప్పుడు, మానవ పరిభాషలో దేవుడు మనతో సంభాషించుటకు, లేఖనములు కొన్ని సార్లు ఈ గుణములు మరియు సృష్టి మధ్య బలహీనమైన, భావార్ధమైన వ్యత్యాసములను కలుగజేస్తాయి. అయినను, నిస్సందేహంగా, ఈ దైవిక గుణములను బైబిలు వివరించు ప్రాథమిక విధానము దేవుడు ఏమైయున్నాడు మరియు సృష్టి ఏమైయున్నది అనే విషయముల మధ్య తారతమ్యము చూపుట. ఇందు వలన, ఈ విధాలుగా దేవుని అనుకరించమని లేఖనములు మానవులను పిలవవు. నిత్యులుగాను, శరీరము లేనివారిగాను, భాగములు లేనివారిగాను, లేక అమితమైనవారిగాను ఉండాలని మనకు హెచ్చరికలు ఇవ్వబడలేదు. బదులుగా, వినయముతో కూడిన ఆరాధనతోను స్తుతులతోను ఆయనలో ఉన్న ఔన్నత్యము గుర్తిస్తూ దేవుని గుణములను ఒప్పుకోవాలని లేఖనములు మనకు పిలుపునిస్తాయి.

దేవుని యొక్క వ్యాప్తిచెందలేని గుణములను గూర్చిన ఈ అవగాహనను దృష్టిలో ఉంచుకొని, మనము దేవుని గుణములలోని రెండవ రకమును పరిగణించుదాము. దేవుని యొక్క వ్యాప్తిచెందు గుణములు.

వ్యాప్తిచెందు. *ఆగ్స్బర్గ్ కన్ఫెషన్* యొక్క మొదటి వ్యాసములో ఇవ్వబడిన గుణములలో, వ్యాప్తి చెందు గుణములు శక్తి, జ్ఞానము మరియు మంచితనమునకు సంబంధించినవి.

"వ్యాప్తి చెందు" అనే పదము పంచగలిగిన గుణములను సూచిస్తుంది. ఈ సందర్భములో, దేవుని యొక్క నిత్య పరిపూర్ణతలలో కొన్ని సృష్టితో, ముఖ్యముగా దేవుని స్వరూపములుగా మానవులతో, పంచుకొనబడతాయి అనే సత్యమును సూచించుచున్నాము. మానవులకు శక్తి, జ్ఞానము మరియు మంచితనము ఉన్నాయి — అపరిపూర్ణముగాను మానవ స్థాయిలోను — కాని ఏదిఏమైనా ఈ గుణములు మనకు ఉన్నాయి.

దేవుని వ్యాప్తి చెందగల గుణములను మనము గ్రహించగల ప్రాథమికమైన మార్గము పోల్చుట. ఈ విధముగా, వ్యాప్తిచెందగల గుణములు మధ్యకాలిక పాండిత్య వేదాంతవేత్తలు "సకారణత్వ మార్గము"గాను "ఔన్నత్య మార్గము"గాను గుర్తించిన వాటిని పోలియున్నవి. లేఖనమంతట, ఈ దైవిక గుణములను మెచ్చుకొనుట మాత్రమేగాక, వాటిని అనుకరించమని మనకు తరచుగా ఆజ్ఞాపించబడింది. మనము శక్తిని ఉపయోగించునప్పుడు దేవుని పోలి మనము ఉండాలి. మన జీవితములలో జ్ఞానమును మరియు

మంచితనమును అభివృద్ధి చేసుకొనుట ద్వారా మరియు ప్రదర్శించుట ద్వారా మనము ఆయనను అనుకరించాలి.

దేవుని పరిపూర్ణతలను గూర్చిన ఈ రెండు రకములను గూర్చి అనేక విషయములు చెప్పవలసియున్నది. మరియు వాటి ప్రాముఖ్యతను గూర్చి ఈ పాఠ్యక్రమములోని తదుపరి పాఠములలో మరి ఎక్కువగా చూద్దాము. కాని ఈ సమయములో, దేవుని పరిపూర్ణతలను ఒకదానితో ఒకటి వ్యత్యాసపరచుటకు అత్యంత సామాన్యమైన మార్గము వాటిని గూర్చి వ్యాప్తి చెందని మరియు వ్యాప్తి చెందగల గుణములుగా మాట్లాడుట అని మాత్రం మనము జ్ఞాపకముంచుకోవాలి.

> క్రమబద్ధ వేదాంతశాస్త్రమును అధ్యయనము చేయుటకు ప్రయత్నిస్తున్న విద్యార్థులు వ్యాప్తిచెందగల మరియు వ్యాప్తి చెందలేని దేవుని గుణముల మధ్య ఉన్న వ్యత్యాసములను గుర్తించుట చాలా ప్రాముఖ్యము, ఎందుకనగా మనలను ప్రత్యేకించబడినవారిగా ఏమి చేస్తుందో మనము గ్రహించాలి. అవునా? దేవుడు ఈ సృష్టికి పూర్తిగా వేరుగా ఉన్నాడు, అయినను మనము ఆయన స్వరూపమందు చేయబడితిమి. కాబట్టి, దేవుని యొక్క స్వరూపములుగా మనము ఏమైయున్నామో మరియు ఏమైయుండి లేమో గ్రహించుట చాలా అవసరము. మరియు దేవుడు చేయు ప్రతిదానిలో ఆయన అమితమైనవాడు మరియు నిత్యుడు మరియు మార్పులేనివాడు అని, మరియు మనము మితమైన, మార్పుగల మరియు చలనముగల వారిగాను విఫలమైనవారిగాను ఉన్నప్పటికీ, మన వ్యక్తిత్వములో కొన్ని విషయములలో అనగా మనకు జ్ఞానము ఉన్నది, మనము ప్రేమించగలము, మనము న్యాయమును కరుణను వెదకగలము అను విషయములలో దేవుని పోలియున్నామని ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవాలి. ఇవి దేవుడు పరిపూర్ణంగా చేయు పనులు — మనము మితమైన స్థాయిలో వీటిని చేస్తాము — కాని ఆయన స్వరూపములుగా మనము ఏమైయున్నామో మరియు మన సృష్టికర్తగా ఆయన ఏమైయున్నాడో మనము గ్రహించుట కూడా చాలా ప్రాముఖ్యమైన విషయము.
>
> — ప్రొ. బ్రాండన్ పి. రోబ్బిన్స్

ఇప్పటి వరకు, దేవుని యొక్క దైవిక గుణములను చూచుట ద్వారా మనము దేవుని గుణములు మరియు కార్యములు అనే అంశములను పరిచయం చేశాము. ఇప్పుడు, ఈ జంట యొక్క మరొక వైపుకు మనము చూద్దాము, దేవుని దైవిక కార్యములు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## దైవిక కార్యములు

ఈ పాఠంలో దైవిక కార్యములను గూర్చి మనము క్లుప్త వివరణను మాత్రమే ఇద్దాము ఎందుకంటే ఈ పాఠ్యక్రమము యొక్క చివరిలో ఈ ఆలోచనను మనము మరింత వివరముగా చూడబోతున్నాము. అయితే ఒక పర్యావలోకనంగా, మొదటిగా మనము దైవిక కార్యములు అనే మూల భావనను చూద్దాము; మరియు రెండవదిగా, మనము దేవుని కార్యములలోని రకములను పరిచయం చేద్దాము. మొదటిగా దైవిక కార్యముల యొక్క మూల భావనను పరిగణించండి.

### మూల భావన

"దేవుని కార్యములు ఏవి?" అని మనము ఎక్కువ మంది ఇవాంజెలికల్ క్రైస్తవులను అడిగితే, లేఖనములో దేవుడు ఇది చేశాడు అది చేశాడు అని తెలియపరచు స్థానములను మాత్రమే వారు చూపిస్తారు. మరియు ఇది చాలా వరకు వాస్తవమే. కాని క్రమబద్ధ వేదాంతవేత్తలు దైవిక కార్యములను కూడా దైవిక లక్షణములను చూసిన విధముగానే చూస్తారు. విశేషమైన చారిత్రిక సన్నివేశముల మీద దృష్టిని పెట్టుటకు బదులుగా, సన్నివేశముల వెనుక ఉన్న దానిని అర్థము చేసుకొనుటకు వారు ప్రయత్నిస్తారు. "దేవుడు చేసిన, చేస్తున్న, మరియు చేయబోవుచున్న వాటిని గూర్చి ఎల్లప్పుడు వాస్తవమైన ఏ విషయములను మనము తెలుసుకోగలము?" అని వారు అడుగుతారు.

దైవిక కార్యములను గూర్చి ఈ సామాన్య పద్ధతిని ఇలా చెబుతూ క్రోడీకరించవచ్చు, క్రమబద్ధ వేదాంతశాస్త్రములో, దైవిక కార్యములు అనే అంశము వీటిని సంబోధిస్తుంది:

> ఆయన నిత్య ఉద్దేశముల ప్రకారం దేవుడు సమస్తమును ఎలా చేయగలడు.

ఈ అంశము యొక్క రెండు కోణములను మనము ఎత్తి చూపుదాము, మరియు దైవిక కార్యములు సమస్త విషయములను అనుబంధపరుస్తాయి అనే వాస్తవముతో ఆరంభించుదాము. దైవిక కార్యములు ప్రతి సన్నివేశమును కలిగియుంటాయి అనే ఆలోచన వేదాంతశాస్త్రము యొక్క నూతన విద్యార్థులకు సిద్ధాంతపరంగాను ఊహాత్మకముగాను ఉండవచ్చు. కాబట్టి, దేవుని కార్యముల యొక్క ఈ కోణమును గూర్చి మనము కొన్ని మాటలను చెప్పాలి. ఎఫెసీ. 1:12లో, పౌలు దేవుని ఈ విధంగా స్తుతిస్తున్నాడు:

> ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్తకార్యములను జరిగించుచున్నాడు (ఎఫెసీ. 1:12).

ఇక్కడ దేవుడు "సమస్తకార్యములను జరిగించుచున్నాడు" అని పౌలు ప్రస్తావించుచున్నట్లు మనము చూడవచ్చు. దేవుడు కొన్ని విషయములను, లేక అనేక విషయములను జరిగించుచున్నాడని అతడు ఇక్కడ చెప్పుటలేదు. ఒక విధముగా, ఇప్పటి వరకు జరిగిన ప్రతి సన్నివేశమును మరియు జరగబోవు ప్రతి కార్యమును దేవుడు జరిగించబోవుచున్నాడని అతని మనస్సులో ఉన్నది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇట్టి గొప్ప పరిమాణములో దేవుని కార్యములను గూర్చి ఆలోచన చేయుట ఆధునిక ఇవాంజెలికల్ క్రైస్తవులకు అసాధారణమైన విషయము. మనలో అనేకమందిమి, లేఖనములను చదివి దేవుడు కొన్ని కార్యములు మాత్రమే చేస్తాడని, మరియు మిగిలిన పనులు సృష్టిలోని ఇతర భాగములు చేస్తాయని నిర్ధారిస్తాము.

ఇప్పుడు, ఇలాంటి వ్యత్యాసములు లేఖనములో కనిపిస్తాయి కూడా. దేవుడు లోకములో సూటిగా కార్యములు చేయుటను గూర్చి బైబిలు కొన్ని సందర్భాలలో మాట్లాడుతుంది. ఉదాహరణకు, దేవుడు సముద్రము యొద్ద ఇశ్రాయేలీయులను విమోచించాడు. కొన్ని అప్రాకృతిక జీవులు కార్యములను చేయుటను గూర్చి కూడా లేఖనములు తెలియజేస్తాయి, ఉదాహరణకు దేవుని శపించమని సాతాను యోబును శోధించుట. దీనిని మించి, మానవులు కార్యములను చేయుటను కూడా మనము చూస్తాము. ఉదాహరణకు, సొలొమోను దేవాలయము నిర్మించుటకు సిద్ధపాటుగా దావీదు కష్టపడి పని చేశాడు. జంతువులు మరియు చెట్లు లోకము మీద ప్రభావము కలిగియుండుటను గూర్చి మనము చదువుతాము. అలాగే బైబిలు అచేతనమైన వస్తువులైన సూర్యుడు భూమి మీద జీవమును కలిగించుట అనే విషయములను గూర్చి కూడా మాట్లాడుతుంది.

అయితే సాంప్రదాయిక వేదాంతశాస్త్రములోని ప్రశ్న ఇది: మనము "దేవుని కార్యములను" కేవలం లేఖనము దేవునికి స్పష్టముగా ఆపాదించు వాటికి మాత్రమే పరిమితము చెయ్యాలా? లేఖనములను అనుసరించి, సాంప్రదాయిక వేదాంతశాస్త్రములోని ముఖ్యమైన శాఖ ఈ ప్రశ్నకు ఒక బలమైన "కాదు" అనే మాటతో జవాబిచ్చింది. పదజాలములను అరిస్టాటిల్ నుండి సేకరిస్తూ, క్రైస్తవ వేదాంతవేత్తలు దేవుని సమస్త విషయములకు "ప్రథమ కారకము"గా వర్ణించారు. ఇవాంజెలికల్ వేదాంతశాస్త్రములో, మొదటి కారకముగా దేవుడు ఊరకే చరిత్రను ఆరంభించలేదు అని దీని అర్థము. బదులుగా, చరిత్రలో జరుగు ప్రతి సన్నివేశములోను ప్రతి సమయములోను దేవుడు ఏకైక కారణమైయున్నాడు.

దేవుని మొదటి కారకముగా నిర్ధారించుటతో పాటుగా, ఇవాంజెలికల్ క్రమబద్ధ వేదాంతవేత్తలు రెండవ కారకములను గూర్చి కూడా మాట్లాడారు. రెండవ కారకములు సన్నివేశములను నిజముగా జరిగించుచున్నప్పటికీ రెండవ స్థానములో పాత్రలను పోషించు సృష్టములు.

లేఖనములు కొన్ని అద్భుతమైన, ఆశ్చర్యకార్యములను — సముద్రములో ఇశ్రాయేలును విమోచించినటువంటి కార్యములు — మాత్రమే దైవిక కార్యములుగా పరిగణించవు అనే సత్యము మీద మొదటి కారకము మరియు రెండవ కారకము మధ్య వ్యత్యాసము ఆధారపడియున్నది. యోబును పరీక్షించుటకు సాతానుకు దేవుడు అనుమతి ఇచ్చాడని యోబు గ్రంథము మొదటి అధ్యాయము తెలియజేస్తుంది. 1 దిన. 29:16లో, సొలొమోను దేవాలయము కొరకు సిద్ధపరచుటలో తాను పొందిన జయము విషయములో దావీదు స్వయముగా దేవునికి మహిమనిచ్చాడు. జంతువులు మరియు మొక్కలు చేయుచున్న కార్యముల మీద దేవునికి నియంత్రణ ఉన్నదని కీర్తనలు 147:7-9 వంటి వచనములు సూచిస్తాయి. మరియు యెషయా 45:6-7 వంటి వాక్య భాగములలో, సూర్యుని వంటి అచేతన వస్తువుల యొక్క ప్రభావములు కూడా దేవునికి ఆపాదించబడినవి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మొదటి కారకమైన దేవుడు సృష్టిని లేక రెండవ కారకములను పలు రకములుగా ఎలా ఉపయోగించుకుంటాడో ఈ పాఠ్యక్రమములో తరువాత మనము చూద్దాము. మరియు ముఖ్యముగా దేవుడు చెడుకు దాత కాదు అని అర్థము చేసుకొనుటలో ఇది ఎలా సహాయం చేస్తుందో మనము చూద్దాము. కాని ప్రస్తుతానికి, ఏదో ఒక విధముగా చరిత్రలో జరుగు సమస్తవిషయములలోను ప్రత్యక్షంగాను లేక పరోక్షంగాను దేవుడు పాలివాడైయున్నాడని మాత్రమే చెప్పదలచుచున్నాము. దైవిక కార్యములను గూర్చిన మూల భావనను గూర్చి మన సారాంశమును మరలా చూసినట్లయితే, దేవుని కార్యములు కూడా "[దేవుని] నిత్య ఉద్దేశముల ప్రకారం" జరుగుతాయని మనము చూడవచ్చు.

ఈ పాఠంలో మునుపు మనము చూసినట్లు, దేవుని గూర్చిన వేదాంతశాస్త్రములో వేదాంతవేత్తలు దేవుని నిత్యమైన, మార్పులేని గుణములకు ఎక్కువ ఆసక్తిని చూపారు. అదే విధముగా, దేవుని కార్యములు ఆయన నిత్యమైన, మార్పులేని ప్రణాళిక లేక ఉద్దేశములకు అనుగుణంగా ఎలా జరుగుతాయో అను విషయము మీద కూడా దృష్టిపెట్టారు. ఇప్పుడు, అనేకమంది ఆధునిక ఇవాంజెలికల్ క్రైస్తవులకు ఈ అంశమును గూర్చి పెద్దగా అవగాహన లేదు అని చెప్పుట సమంజసమవుతుంది. మరియు అట్టి విషయములను గూర్చి మాట్లాడువారికి వాటిని అర్థము చేసుకొనుటకు వేర్వేరు పద్ధతులు ఉన్నాయి. కాబట్టి, మన మనస్సులో ఉన్న ముఖ్య ఆలోచనను వివరించుటకు మనము ఒక క్షణం వెచ్చించాలి. ఎఫెసీ. 1:11లో పౌలు దేవుని ఈ విధముగా స్తుతించిన విషయమును మీరు జ్ఞాపకము చేసుకోవచ్చు:

> ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్తకార్యములను జరిగించుచున్నాడు (ఎఫెసీ. 1:12).

ఇక్కడ పౌలు "సమస్త కార్యముల"ను దేవుని కార్యముగా మాత్రమే మాట్లాడుటలేదుగాని, దేవుని యొక్క సమస్త కార్యములు "ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున" జరుగుచున్నాయని చెబుతున్నాడని గమనించండి. చరిత్ర కొరకు దేవునికి ఒక నిత్య ప్రణాళిక ఉన్నది, మరియు ఆ ప్రణాళికను ఆయన ఖచ్చితముగా నెరవేర్చుతాడు అనే పాత నిబంధన ఆలోచనను ఇక్కడ పౌలు ఉపయోగిస్తున్నాడు. ఉదాహరణకు, యెషయా 46:10లో దేవుడు ఈ విధంగా చెప్పిన మాటలను ఒకసారి వినండి:

> నా ఆలోచన నిలుచుననియు నా చిత్తమంతయు నెరవేర్చుకొనెదననియు,
> చెప్పుకొనుచు ఆది నుండి నేనే కలుగబోవువాటిని తెలియజేయుచున్నాను.
> పూర్వకాలమునుండి నేనే యింక జరుగనివాటిని తెలియజేయుచున్నాను (యెషయా 46:10).

ఇప్పుడు, దేవుని కార్యముల యొక్క ఈ కోణము ఎంత నిగూఢమైనదంటే నమ్మకమైన క్రైస్తవులు దీనిని అనేకమైన విధములుగా అర్థము చేసుకున్నారు. అయితే మొత్తానికి, దేవునికి నిత్యమైన ప్రణాళిక ఉన్నదని అధికారిక క్రైస్తవ వేదాంతశాస్త్రము ఎల్లప్పుడు ఉద్ఘాటించింది. మరియు ఆయన కార్యములు — చరిత్ర యొక్క ప్రతి కోణమును కలిగియున్నవి — ఎల్లప్పుడు ఆయన నిత్య ఉద్దేశములను నెరవేర్చుతాయి.

చరిత్రలో జరుగబోవు విషయములను గూర్చి దేవుడు అవివేకిగా లేడు. ఆయన చరిత్ర ద్వారా ఎన్నడు ఆశ్చర్యపరచబడడు. ఆయన ఉద్దేశములు ఎన్నడును తప్పిపోవు. అది ఎంత నిగూఢమైన విషయమైనా, క్రీస్తుయందు చరిత్రలో దేవుని యొక్క సంపూర్ణ ప్రణాళికకు వెలుపల ఏదియు లేదు.

> లోకములో ఏదైనా సంభవించినప్పుడు, ప్రజలు ఇలా ఆశ్చర్యపోతారు, "ఇది నిజముగా దేవుని మనస్సులో ఉన్న విషయమా లేదా?" మరియు లోకములో అవాంఛనీయమైన కార్యములు జరిగినప్పుడు, "దీనిలో దేవుడు ఎక్కడ ఉన్నాడు, మరియు ఆయన ప్రణాళిక ఏమిటి?" అని మనము ఆశ్చర్యపడుతుంటాము. మరియు దేవుని సార్వభౌమత్వమును గూర్చిన బైబిలు సిద్ధాంతము యొక్క సంపూర్ణతను అర్థము చేసుకొనుట మనకు ఉపయోగకరముగా ఉంటుందని నేననుకొనుచున్నాను, ఎందుకంటే దేవుని యొక్క ఉన్నతమైన చిత్తము మరియు ఉద్దేశమునకు వెలుపల ఏదియు జరగదని స్పష్టమైనది. మరియు మనము లేఖనములో అనేక స్థలములను చూపవచ్చు. నిశ్చయముగా ఎఫెసీ. 1 వాటిలో ఒకటి, మరియు అక్కడ దేవుడు సమస్తమును ఆయన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున చేస్తాడని స్పష్టముగా తెలియజేయబడింది. కాబట్టి చరిత్రలో ఇప్పటి వరకు జరిగిన ప్రతిదీ కూడా దేవుని యొక్క ఉద్దేశములలో భాగమైనదైయున్నది... మరియు దేవుడు — ఇది మితమైన జ్ఞానము గల మనకు ఒక గొప్ప మర్మమైయున్నది — మానవ చరిత్ర అంతటిలో జరిగించుచున్న ఒక ఉద్దేశమును కలిగియున్నాడు.
>
> — డా. ఫిలిప్ రైకెన్

> ఒకవేళ దేవుడు సర్వజ్ఞాని అయితే, దేవుని జ్ఞానము వర్తమాన భూత భవిష్యత్ విషయములన్నిటిని, సాధ్యమైనవన్నిటిని మరియు వాస్తవమైనవన్నిటిని ఎరిగియుంటే, అప్పుడు సమస్త చారిత్రిక సన్నివేశములు ఆయన ప్రణాళికలో భాగములైయున్నాయి.
>
> — డా. గ్లెన్ ఆర్. క్రెయిడెర్

దైవిక కార్యముల యొక్క మూల భావనను చూశాము కాబట్టి, దేవుని సిద్ధాంతము యొక్క అధికారిక చర్చలు దైవిక కార్యముల యొక్క రకములు, లేక విధముల మధ్య వ్యత్యాసమును ఎలా చూపాయో కూడా మనము ప్రస్తావించాలి.

### రకములు

ఒక ఉదాహరణగా, *ఆగ్స్బర్గ్ కన్ఫెషన్* యొక్క మొదటి వ్యాసమును మరొక సారి వినండి:

> పిలువబడిన మరియు దేవుడైయున్న దైవిక సారము ఒకటి కలదు: నిత్యమైన, శరీరము లేని, భాగములు లేని, అమితమైన శక్తి, జ్ఞానము మరియు మంచితనముగల, దృశ్య అదృశ్యమైన విషయములన్నిటి యొక్క సృష్టికర్త మరియు పోషకుడు.

ఇక్కడ మనము చూస్తున్నట్లుగా, దేవుని యొక్క అనేక గుణములను తెలియజేసిన తరువాత, కన్ఫెషన్ దైవిక కార్యములలోని రెండు రకముల వైపు మన ఆసక్తిని ఆకర్షిస్తుంది. ఒక ప్రక్కన, దేవుడు "దృశ్య అదృశ్య విషయములన్నిటికి సృష్టికర్త" అని అది చెబుతుంది. మరొక వైపు, దేవుడు "దృశ్య అదృశ్య విషయములన్నిటికీ పోషకుడని" అది చెబుతుంది.

*ఆగ్స్బర్గ్ కన్ఫెషన్* లోని ఈ ఒప్పుకోలులు రెండు రకముల దైవిక కార్యముల మధ్య ప్రఖ్యాతిగాంచిన సాంప్రదాయిక వ్యత్యాసమునకు ప్రాతినిధ్యం వహిస్తాయి. మొదటిది దేవుని సృష్టి కార్యము. ఆది. 1:1లో బైబిలు ఈ విధంగా ఆరంభమవుతుందని మనందరికీ తెలుసు.

> ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను (ఆది. 1:1).

అనేక విధాలుగా, లేఖనము ఈ బోధనతో ఎందుకు ప్రారంభమయ్యిందంటే, ఇది దేవుని కార్యములను గూర్చి మనము నమ్ము ప్రతి విషయమునకు పునాదిగా ఉన్నది.

దేవుని గూర్చిన వేదాంతశాస్త్రములో దేవుని సృష్టి కార్యమును సాంప్రదాయిక ఆలోచనలను క్రోడీకరించుటకు అనేక మార్గములు ఉన్నాయి. మరియు ఈ విషయములను మనము తదుపరి పాఠములలో చూద్దాము. కాని, ఈ పాఠంలో, మూడు ముఖ్య ఉద్ఘాటనలను ప్రస్తావించుట ఉపయోగకరముగా ఉంటుంది. మొదటిది, సృష్టి యొక్క వాస్తవము: ఉనికిలో ఉన్న ప్రతి దానిని దేవుడు ఎలా సృష్టించాడు. రెండవది, సృష్టి యొక్క రకములు: భౌతిక మరియు ఆత్మీయ స్థానములలో దేవుడు రకములను ఎలా సృష్టించాడు. మరియు మూడవది, సృష్టి యొక్క ఉద్దేశము: ఆయన నిత్య ఉద్దేశములను నెరవేర్చుకొనుటకు దేవుడు మొదట సృష్టిని ఎలా స్థాపించాడు.

సృష్టి యొక్క కార్యముతో పాటుగా, రెండవ రకమైన దేవుని కార్యములు దేవుని దైవకృత కార్యమైయున్నది, లేక చాలా సార్లు చెప్పబడునట్లు, దేవుడు ఆయన సృష్టిని కాపాడతాడు అనే సత్యమైయున్నది.

దురదృష్టవశాత్తు, చాలా సార్లు, నేటి ఇవాంజెలికల్ క్రైస్తవులు దేవుని దైవకృత కార్యము యొక్క ప్రాముఖ్యతను అర్థము చేసుకోలేరు. దేవుడు లోకమును సృష్టించినప్పుడు, ఆయన ధ్యాస లేకుండా సొంతగా పని చేయుటకు దానికి కొంత స్వతంత్రతను ఆయన ఇచ్చాడని వారు ఊహిస్తారు. కాని సాంప్రదాయిక క్రమబద్ధ వేదాంతశాస్త్రములో, "దైవకృతము" అనే పదము — ల్యాటిన్ పదమైన "*ప్రొవిడెన్షియ*" నుండి — "ఒకరికి సేవ చేయుట, లేక ఒకరిని పోషించుట" అనే అర్థములు కలిగియున్నది. మరియు ఈ పదజాలము, సృష్టి సృష్టించబడినప్పుడు దేవుని మీద ఎంతగా ఆధారపడియున్నదో నేడు కూడా అంతే ఆధారపడియున్నదను

క్రైస్తవ నమ్మకమును ప్రతిబింబిస్తుంది. అపొస్తలుడైన పౌలు ఈ క్రింది మాటలు చెప్పిన కొలస్సీ. 1:16-17ను ఒక సారి వినండి:

> ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు [క్రీస్తుయందు] సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు (కొలస్సీ. 1:16-17).

ఈ లేఖన భాగము సూచించుచున్నట్లుగా, క్రీస్తులో సమస్తము సృష్టించబడినది అనే మాట మాత్రమే సత్యము కాదుగాని, సమస్తమునకు ఆయనే ఆధారభూతుడు అనే మాట కూడా అంతే వాస్తవమైయున్నది. ఈ సమాంతరతను చూపుట ద్వారా, దేవుని దైవకృతము — ఆయన కాపాడు మరియు కొనసాగించు శ్రద్ధ — సృష్టిలో నిరంతరము పని చేయకుండా సృష్టి నిలువబడలేదని అపొస్తలుడు స్పష్టము చేశాడు.

సులభంగా చెబితే, సృష్టి యొక్క కార్యము వలెనె, దైవకృత కార్యమును కూడా మూడు విధములుగా క్రోడీకరించవచ్చు: సృష్టి పట్ల దేవుని దైవకృత శ్రద్ధ అను వాస్తవము, అనగా ఆయన సృజించిన సమస్తమును ఆయన ఎలా కాపాడుతున్నాడు మరియు కొనసాగించుచున్నాడు; దేవుని దైవకృత శ్రద్ధ యొక్క రకములు, ఆయన సృష్టి యొక్క పలు కోణములతో పలు విధములుగా ఎలా పాలుపంచుకుంటాడు; మరియు దేవుని దైవకృత శ్రద్ధ యొక్క ఉద్దేశము, సృష్టి ఆయన నిత్య ఉద్దేశములను నెరవేర్చునట్లు దేవుడు ఎలా చూస్తాడు. ఈ పాఠములో దీని వివరములను మనము చూడము. కాని, దేవుని సిద్ధాంతమును చదువుట మనము కొనసాగించుచుండగా, దేవుని కార్యములను అనగా సృష్టిలో ఆయన కార్యమును మరియు దైవకృతములో ఆయన కార్యమును అర్థము చేసుకొనుట ఎంత ప్రాముఖ్యమో మనము మరింత స్పష్టముగా చూస్తాము.

> సరే, దేవుని దైవకృతమును గూర్చి మనము మాటలాడునప్పుడు, మనము ఆయన సృష్టి పట్ల మరియు ఆయన సృష్టములన్నిటి పట్ల దేవుని యొక్క కొనసాగు భద్రతను గూర్చి మనము మాట్లాడుచున్నాము. దేవుడు లోకమును సృష్టించి వేరొక పని చేయుటకు ఏటో కనిపించకుండా వెళ్లిపోయాడని మనము నమ్మము. కాదు, ఆయన వాక్య శక్తి ద్వారా దేవుడు లోకమును కాయుటను కొనసాగిస్తున్నాడు. ఆయన వాక్యము ద్వారా, ఆయన ఆత్మ ద్వారా, దేవుడు లోకమును కొనసాగిస్తున్నాడు. కాబట్టి మనకు కావలసినది దేవుడు ఇచ్చుచున్నాడని మనము ఆలోచన చేస్తాము: ఆహారము, నీరు, గాలి, మనము పెద్దగా పట్టించుకోని వీటినన్నిటిని దేవుడు ఇచ్చుచున్నాడు. ఇందువలననే మనము దేవునికి వందనములు చెప్పుట ఎంతో అవసరము. మనము భోజనము చేయునప్పుడు ధన్యవాదములు తెలిపి ఆయనకు స్తుతులు వందనములు అర్పిస్తాము. మనము పొందుకున్న ప్రతి మంచి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

బహుమానము పైనున్న తండ్రి యొద్ద నుండి కలిగియున్నది. కాబట్టి, మనకు అవసరమైన ప్రతిది ఆయన ఇస్తాడని మనము జ్ఞాపకముంచుకోవాలి. ఆయన మన రాజ్యపాలకుడైయున్నాడు. ఆయన వాస్తవానికి సమస్త విషయముల మీద పైవిచారణ చేయుచున్నాడు, కొన్ని సార్లు చేయజారిపోయినవనిపించు కొన్ని చారిత్రిక సన్నివేశములను కూడా, కాని దేవుడు వీటన్నిటి పైన సర్వశక్తిగలవాడు, వాటిని నడిపించుచున్నాడు, మనకు ఆశ్చర్యము కలుగు కార్యములు జరుగునట్లు అనుమతి ఇస్తున్నాడు, కాని దేవుడు సమస్తమును అదుపులో ఉంచుకొని వాటిని తమ ఫలితములోనికి నడిపిస్తున్నాడని మనము నమ్ముతాము. అంతే గాక, మన కొరకు మన రక్షణ కొరకు సహాయము చేస్తూ, ఆయన కృపగల పునరుద్ధరణ కార్యము, మన పునఃనిర్మాణ కార్యము యొక్క అవసరతను, మనము ఆయన యందు విశ్వాసముంచితే ఒక రోజు మనలను నూతన ఆకాశము మరియు నూతన భూమికి తీసుకొనివెళ్తాడని మనము గ్రహించుటలో సహాయము చేస్తున్నాడు... అక్కడ మనము చూడబోవుచున్నది ఏమనగా దేవుని దైవకృతము యొక్క సంపూర్ణత మరియు మనలను బహుగా ప్రేమించు గొప్ప పరలోకపు తండ్రిగా ఆయన మన కొరకు ఇచ్చిన ప్రతి పనిలో నిలిచియుండుటకు మనకు ప్రతి మంచి వరమును ఆయన అనుగ్రహిస్తాడు.

— రెవ. డా. జస్టిన్ టెర్రి

## ముగింపు

ఈ పాఠంలో, దేవుని సిద్ధాంతము లేక దేవుని గూర్చిన వేదాంతశాస్త్రము మీద మన అధ్యయనమును, దేవుని గూర్చి మనకు తెలిసిన విషయములలో మనము ఎలా ఎదగగలము అనే విషయము మీద దృష్టి పెట్టి పరిచయం చేశాము. దైవిక ప్రత్యక్షత మరియు మర్మముల ద్వారా, విశేష, సాధారణ ప్రత్యక్షత మరియు తాత్కాలిక, శాశ్వత మర్మములతో సహా, దేవుని గూర్చి మనము కలిగియున్న జ్ఞానము ఎలా రూపుదిద్దుకుంటుందో మనము చూశాము. మరియు దేవుని గూర్చి మనము కలిగియున్న జ్ఞానము ఆయన గుణములు మరియు ఆయన కార్యములు, అనగా ఆయన వ్యాప్తి చెందని మరియు వ్యాప్తి చెందు గుణములు, ఆయన సృష్టి మరియు దైవకృత కార్యములను గూర్చి అవగాహనను ఇస్తుందని నేర్చుకున్నాము.

దేవునిని గూర్చిన తమ వ్యక్తిగత జ్ఞానములోను మరియు లోకములో ఆయన కార్యములను వారు అనుభవించు విధానములోను ఎదుగుటకు క్రీస్తు అనుచరులు ఆతృత కలిగియుండాలి. అయితే ఇలా చేయుటకు, దేవుని గూర్చి వీలైనంత నేర్చుకొనుట పట్ల మనము సమర్పణ కలిగియుండాలి. ఈ పాఠంలో, దేవుని గూర్చిన వేదాంతశాస్త్రములో పైపైన కనిపించు కొన్ని ముఖ్య విషయములను గూర్చి మాత్రమే

మనము చర్చించాము. అయితే తరువాత పాఠములలో, దేవుడు ఎవరు మరియు ఆయన ఏమి చేస్తాడు అను అంశములను అన్వేషిస్తూ దేవుని సిద్ధాంతమును గూర్చి మరింత విపులముగా నేర్చుకుందాము. మరియు వాటిని అధ్యయనము చేయుచుండగా, దేవుని గూర్చిన మన జ్ఞానమును పెంచుకొనుట క్రైస్తవ వేదాంతశాస్త్రము యొక్క ప్రతి కోణమునకు మరియు దేవునికి నమ్మకమైన సేవ చేయు ప్రతి కోణమునకు ఎంత అవసరమైయున్నది అను విషయములోని ప్రతి అడుగును మనము చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.